
# ఎజ్రా గ్రంథ ధ్యానము



రచయిత

టి. పి. వరప్రసాద రెడ్డి.

పబ్లిషర్స్
షాలోమ్ క్రిస్టియన్ అసెంబ్లీ,
1/183 విద్యా నగర్. J.N.T.U.C. పోస్టాఫీసు,
అనంతపురము-2. (A.P), సౌత్ ఇండియా.
సెల్-9440285883, 9440669494.

# ఎజ్రా గ్రంథ ధ్యానము

రచయిత :
**టి.పి. వరప్రసాద రెడ్డి**

పబ్లిషర్స్ :
**షాలోమ్ క్రిస్టియన్ అసెంబ్లీ**
1/183, విద్యానగర్, JNTUC పోస్టాఫీసు,
అనంతపురము- 515 002. (ఏ.పి.), సౌత్ ఇండియా
సెల్ : 9440285883, 9440669494

ప్రచురణ : 5 నవంబర్, 2020

వెల రూ. 40/-

రచయిత :

**టి.పి. వరప్రసాద రెడ్డి**

ఎజ్రా 7:6 ఎజ్రా యెహోవా అనుగ్రహించిన మోషే యొక్క ధర్మశాస్త్రమందు ప్రవీణతగల శాస్త్రి.

బైబిల్‌నందలి ఇతర ప్రవీణులను గమనించండి.

1. 2 సమూ 17:8 నీ తండ్రియగు దావీదు యుద్ధమునందు ప్రవీణుడు.
2. 1 దిన 25:7 యెహోవాకు గానము చేయుటలో నేర్పుపొందిన ప్రవీణులైన పాటకులు.
3. 2 దిన 34:12 లేవీయులలో వాద్య ప్రవీణులైన వారు వారితో కూడ ఉండిరి.
4. దాని 1:3 దానియేలు సకల విద్యా ప్రవీణతయు జ్ఞానమును గలవాడు.
5. అపో 18:24 అలెక్సంద్రియవాడైన అపోల్లో లేఖనములయందు ప్రవీణుడునై యుండెను.

గమనిక :- ఈ గ్రంథమును ధ్యానించు నీవును ఎజ్రావలె బైబిలు గ్రంథ ధ్యానమందు ప్రవీణతను సంపాదించుకొనాలి.

ప్రతులకు :

**షాలోమ్ క్రిస్టియన్ అసెంబ్లీ**

**1/183, విద్యానగర్, JNTUC పోస్టాఫీసు,**

**అనంతపురము- 515 002. (ఏ.పి.), సౌత్ ఇండియా**

**సెల్ : 9440285883, 9440669494**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1) | ఎజ్రా గ్రంథ కాలములో పాలించిన అన్యరాజులు | 4 |
| 2) | ఎజ్రా - నెహెమ్యా గ్రంథముల సమన్వయము | 5 |
| 3) | ఎజ్రా గ్రంథ రచయిత ఎజ్రా | 8 |
| 4) | షేష్బజ్జరు అనబడిన జెరుబ్బాబెలు | 9 |
| 5) | యేషూవ అనబడిన యెహోషువ | 10 |
| 6) | ప్రవక్తలగు జెకర్యా హగ్గయిలు | 11 |
| 7) | ఎజ్రా గ్రంథ వివరమైన విభజన | 12 |
| 8) | ఎజ్రా గ్రంథము 1వ అధ్యాయము | 15 |
| 9) | ఎజ్రా గ్రంథము 2వ అధ్యాయము | 17 |
| 10) | ఎజ్రా గ్రంథము 3వ అధ్యాయము | 21 |
| 11) | ఎజ్రా గ్రంథము 4వ అధ్యాయము | 25 |
| 12) | ఎజ్రా గ్రంథము 5వ అధ్యాయము | 27 |
| 13) | ఎజ్రా గ్రంథము 6వ అధ్యాయము | 29 |
| 14) | ఎజ్రా గ్రంథము 7వ అధ్యాయము | 35 |
| 15) | ఎజ్రా గ్రంథము 8వ అధ్యాయము | 39 |
| 16) | ఎజ్రా గ్రంథము 9వ అధ్యాయము | 41 |
| 17) | ఎజ్రా గ్రంథము 10వ అధ్యాయము | 43 |
| 18) | వాక్యానుసారమైన విశ్వాసుల వివాహాలు | 45 |
| 19) | మాచే రచించబడిన పుస్తకములు | 48 |

# ఎజ్రా గ్రంథ కాలములో పాలించిన అన్య రాజులు

ఎజ్రా 1:2లో పారశీక రాజగు కోరెషు లోకములోని జనులందరిని నాకు అప్పగించాడని చెప్పుచున్నాడు.

లోకములోని జనులందరిని పాలించిన ఏడు సామ్రాజ్యములు కలవు.

1) ఐగుప్తు సామ్రాజ్యము - క్రీ.పూ. 1800-1400

2) అష్షూరు సామ్రాజ్యము - క్రీ.పూ. 900 - 606

3) బబులోను సామ్రాజ్యము - క్రీ.పూ. 606 - 535

4) మాదీయ పారశీక సామ్రాజ్యము - క్రీ.పూ. 536 - 330

5) గ్రీకుల సామ్రాజ్యము - క్రీ.పూ. 330-30

6) రోమీయుల సామ్రాజ్యము - క్రీ.పూ. 30 - క్రీ.శ. 480

7) మతపరమైన రోమా రాజ్యము - క్రీ.పూ. 480 - నేటి వరకు...

ఈ గ్రంథములోని సంగతులు పారసీక దేశపు రాజులైన కోరెషు, దర్యావేషు, అర్తహషస్తల కాలములో జరిగినవి.

మాదీయ పారశీక సామ్రాజ్యము (క్రీ.పూ. 536-330)

కోరెషు (క్రీ.పూ. 536 - 529), కేంబిసిస్ (క్రీ.పూ. 529 - 522), దర్యావేషు (క్రీ.పూ. 521-485), అహష్వేరోషు (క్రీ.పూ. 485-465) మరియు అర్తహషస్త (క్రీ.పూ. 465-425) పాలించిరి.

1-6 అధ్యాయములో మందిరము నిర్మించబడిన వివరములు కలవు. పారశీకుడగు కోరెషురాజు మందిరమును నిర్మించమని ఆజ్ఞాపించాడు. కోరెషు రాజును గూర్చి ఆయన పని జరిగించిన వివరములను గూర్చి మొదటి అధ్యాయ ధ్యానములో వివరించబడినవి.

దర్యావేషు రాజు మందిర నిర్మాణమును ముగించిన వివరములు ఆరవ అధ్యాయ ధ్యానములో చూతుము.

రాజైన అహష్వేరోషు కాలములో ఎస్తేరు గ్రంథకాల వివరములు చూతుము. మరియు రాజైన అర్తహషస్త కాలములో మందిరము అలంకరించబడిన వివరములు 7-10 అధ్యాయములలో చూతుము.

# ఎజ్రా నెహెమ్యా గ్రంథముల సమన్వయత

ఎజ్రా నెహెమ్యా గ్రంథములు సమాంతర గ్రంథములు. ఎజ్రా గ్రంథములో పడగొట్టబడిన మందిరము కట్టుట ముఖ్య అంశము. నెహెమ్యా గ్రంథములో పడద్రోయబడిన యెరూషలేములో పట్టణ ప్రాకారము కట్టబడుట ముఖ్య అంశము. ఈ రెండు గ్రంథముల పోలిక ప్రక్క పేజీలో చెప్పబడినది. ఎజ్రా గ్రంథకర్త ఎజ్రాయే. ఇందులో 280 వచనములు కలవు. మందిరము లేక దేవాలయము లేదా గుడి అను పదములు ప్రతి అధ్యాయములో కలవు.

| క్ర.స. | అంశము | 1అ. | 2అ. | 3అ. | 4అ. | 5అ. | 6అ. | 7అ. | 8అ. | 9అ. | 10అ. | మొత్తము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | వచనములు | 11 | 70 | 13 | 24 | 17 | 22 | 28 | 36 | 15 | 44 | 280 |
| 2 | మందిరము | 6 | 2 | 8 | 4 | 15 | 14 | 7 | 6 | 1 | 3 | 66 |
| 3 | పని | - | 1 | 3 | 4 | 2 | 6 | - | 1 | - | 5 | 22 |
| 4 | నిర్ణయము | - | - | 2 | - | 1 | 4 | 3 | 2 | - | 2 | 14 |

పది అధ్యాయములలో మొత్తముగా మందిరము అను పదము 66 పర్యాయాలు, పని అను పదము 22 పర్యాయములు, నిర్ణయము అను పదము 14 పర్యాయములు వున్నందున మందిరపని దాని నిర్ణయము ఈ గ్రంథము యొక్క సారాంశము. ముఖ్యముగా ఆత్మ సంబంధమైన మందిరము దాని నిర్ణయములు మనము తలంచవచ్చు. ఈ గ్రంథమునందు 280వచనములు వున్నను ఇంచుమించు 5 అధ్యాయములలో కేవలము పేరులు గల 113 వచనములు వున్నవి. (2 అ.లో 67 వచనములు, 7 అ.లో 5 వచనములు, 8 అ.లో 14 వచనములు, 10 అ.లో 27 వచనములు). అవిపోగా మిగిలిన 167 వచనములలో 66 పర్యాయములు మందిరము అను పదము వున్నందున ప్రతి మూడు వచనములకు ఒకసారి మందిరమను పదము వున్నట్లు తలంచవచ్చును.

ఒకవేళ మనము కూడా ప్రతి మూడు వరుసలకు ఒకసారి మందిరము అని వ్రాయగలిగితే ఎలా వుంటుంది. లేదా మనము మాటలాడే ప్రతి మూడు వచనాలలో ఒకసారియైన మందిరము అనుమాట మాటలాడగలిగితే ఎంత బాగుంటుంది. మూడు గంటలు, మూడు దినములు, ముప్పయి దినములైనా మందిరమును గూర్చి పట్టించుకొనక మరచిపోయి మౌనముగా వుండగలము. మన మనసంతటిలో దేవుని మందిరము, దాని పని దాని నిర్ణయాలు, ఈ మూడు మాటలను నిత్యము మనసులో వుంచుకోవాలి. 113 పేరుల వచనములను ధ్యానించవచ్చు. పేరుల అర్థములను ధ్యానించుట ప్రయోజనకరమే.

## ఎజ్రా గ్రంథ విభజన 6+4=10 అధ్యాయాలు

గ్రంథకర్త : ఎజ్రా కాలం:536-457 = 80 సంແలు

ఎజ్రా అనగా సహాయం అని అర్థం. రోమా 8:26 ప్రకారం పరిశుద్ధాత్మకు గుర్తు.

విభజన

**1-6 అ. : మందిరము కట్టుట. 7-10 అ. అలంకరణ (దిద్దుబాటు)**

**1-2 అ. : యెరూషలేమునకు ప్రయాణం**

**1అ. పనికి సిద్ధపాటు :-** క్రీ.పూ. 536లో మందిరం కట్టవలెనని పారసీకుడగు కోరెషుకు దేవుడు ఆజ్ఞాపించగా ఉపకరణములను తీసుకొని యెహోషువ, జెరుబ్బాబెలుల నాయకత్వంలో 49,897 మంది ప్రజలు బయలుదేరుట. (11 వ.)

**2అ. పనికి ప్రయాణము :-** యెరూషలేమునకు వెళ్ళినవారి వివరాలు, తెచ్చిన సామాగ్రి వివరాలు (64 వ.)

**3అ. పని ప్రారంభం :-** బయలుదేరి వచ్చిన 20 సంແల పై వయసు గల లేవీయులందరిని పనికి నియమించి దేవున్ని స్తుతించుచూ మందిరం పునాదివేయుట (8 వ.)

**4-5 అ. పనికి ఆటంకాలు :-**

**4 అ. ఆటంకముల మధ్య పని నిలిచిపోవుట :-** విరోధులైవారు అర్తహషస్తరాజుకు అబద్ధములు చెప్పి పని ఆగిపోవునట్లు చేయగా క్రీ.పూ. 535-520 వరకు 15 సంແలు పని ఆగిపోయెను (24వ.)

**5 అ. ఆటంకముల మధ్య పని మరలా ప్రారంభం :-** క్రీ.పూ. 520లో హగ్గయి, జెకర్యాల పురికొల్పుతో 15 సంແలు ఆగిన మందిరపు పని ప్రారంభం (2వ.)

**6 అ. పని సమాప్తము :-** 6:15 వచనం ప్రకారం దర్యావేషు రాజు ఏలుబడియందు 6వ సంແ అనగా క్రీ.పూ. 515 సంແలో మందిరపు పని సమాప్తి చేయబడెను. ప్రతిష్ఠింపబడి పస్కా పండుగ పులియని రొట్టెల పండుగలు జరుపుకొనిరి.

**7-8 అ. పని, పనివారలు - అలంకరణ :-**

**7 అ. పనివారల నియామకము :-** ధర్మశాస్త్రమందు ప్రవీణత కలిగి పరిశోధించిన ఎజ్రాను దేవుడు నియమించి బబులోను నుండి అర్తహషస్త కాలంలో యెరూషలేమునకు పంపాడు. క్రీ.పూ. 457లో 1756 మంది పనివారలతో బయలుదేరి వచ్చి యాజకులను లేవీయులను ఉపదేశకులను సహాయకులైన నెతీనీయులను నియమించి మందిరం అలంకరించాడు. మందిరం కార్యక్రమ విధుల కూడా నియమించాడు (27 వ.)

**8 అ. పనివారిని ప్రత్యేకించి పరికరములు అప్పగించుట :-** యాజకులను మందిరపు పరికరములు తీసుకొని యెరూషలేమునకు వచ్చి మందిరమునందుంచుట. (36 వ.)

**9 అ. ప్రార్థన :-** ఎజ్రా యాజకులతోను, జనములతోను కలిసి సమాజము యొక్క పవిత్రత కొరకై ప్రార్థించెను (15 వ.)

**10 అ. పవిత్రత దిద్దుబాటు :-** యూదా బెన్యామినీయులవారు యాజకులు, లేవీయులు, గాయకులు ద్వారపాలకులు తమ పాపము ఒప్పుకొనుచు, జీవితములు దిద్దుకొనుట (17 వ.)

# నెహెమ్యా గ్రంథ విభజన 6+7 = 13 అధ్యాయాలు

గ్రంథకర్త : నెహెమ్యా కాలం : 445-425 = 20 సం॥

నెహెమ్యా అనగా ఆదరణ అని అర్థం. యోహాను 14:26 ప్రకారము పరిశుద్ధాత్మకు గుర్తు.

విభజన

1-6 అ. యెరూషలేము ప్రాకారము కట్టుట. 7-13అ. : అలంకరణ (దిద్దుబాటు)

**1 అ.పనికి సిద్ధపాటు :-** పడిపోయిన ప్రాకారం గూర్చి వార్త విని ప్రార్థించి రాజుతో మనవి చేసి సిద్ధపడుట. (4 వ.)

**2 అ. పనికి ప్రయాణము :-** రాజు యొక్క సెలవుతో ప్రయాణం. (9వ)

3 అ. పని ప్రారంభం క్రీ.పూ. 445లో పట్టణ ప్రాకారాలను పలు రకాలైన పనివారలతో కట్టుటకు ప్రారంభించుట. (14వ.)

**4-5 అ. పనికి ఆటంకాలు :-**

**4అ. ఆటంకములు మధ్య పని కొనసాగుట :-** శత్రువులైన సన్బల్లటు, టోబియా, గేషెము ద్వారా ఆటంకములు కలిగినను పని కొనసాగెను. (6వ)

**5 అ. స్వజనుల వలన ఆటంకాలు :-** స్వజనులైన యూదుల వలన ఆటంకాలు కలిగినను మందిరం ప్రాకారపు పని కొనసాగెను (16వ)

**7-8 అ. పనివారలు - అలంకరణ :-**

**7 అ. పనివారల నియామకము :-** లేవీయులను, గాయకులను, పాలకులను నియమించి కోటకు అధిపతి అయిన హనానీ అధికారము క్రింద ఉంచెను. (1వ)

**8 అ. పని వివరము :-** ధర్మశాస్త్ర గ్రంథమును ఎజ్రా ఉదయం నుండి మధ్యాహ్నం వరకు 13 మంది పనివారలతో చదివి వినిపించగా 13 మంది లేవీయులు తాత్పర్యము చెప్పిరి. యెహోషువ దినములు మొదలుకొని ఎన్నడు జరుగనట్లు 7 దినాలు పర్ణశాలల పండుగ జరిగెను (17వ.)

**9 అ. ప్రార్థన :-** నెహెమ్యా, జనులు, యాజకులతో కలసి ఉపవాసం ఉండి గోనెపట్ట కట్టుకొని పాపం ఒప్పుకొనుచూ దేవుని కార్యములు తలపోసుకొనుట.

**10-13 అ. పవిత్రత - దిద్దుబాటు :-**

**10 అ.** దేవుని మందిర కార్యక్రమ విషయాలలో యాజకులు, లేవీయులు, ద్వారపాలకులు, గాయకులు అందరు కలసి స్థిరమైన నిబంధన చేసి వ్రాసికొని ముద్రవేయుట.

11 అ. అధికారులు పనివారలు యెరూషలేములో నివసించుటకై తీర్మాణము చేసుకొనిరి.

12 అ. ప్రాకారములను క్రొత్త గీతములతో ప్రతిష్టించుకొనుట. (47వ)

13 అ. క్రీ.పూ. 432లో నెహెమ్యా. అర్తహషస్త రాజును దర్శించి యెరూషలేముకు తిరిగి వచ్చి మందిరంలోని యాజకుల, లేవీయుల పోషణ విషయమై దిద్దుబాటును క్రీ.పూ. 424 వరకు జరిగించెను. (13వ)

# ఎజ్రా గ్రంథ రచయిత ఎజ్రా

ఈ గ్రంథములో ఎజ్రా 7:28లో నా దేవుడైన యెహోవా హస్తము నాకు తోడుగా ఉన్నందున నేను బలపరచబడి, ఇశ్రాయేలీయుల ప్రధానులను నాతో కూడ వచ్చుటకు సమకూర్చితిని. నా దేవుడు, నాకు, నేను అను మాటలను బట్టి ఎజ్రాయే ఈ గ్రంథమును వ్రాసాడని తలంచగలము. ఈ ఎజ్రా ఒక శాస్త్రి అని ఎజ్రా 7:6లో చెప్పబడినది. ఎజ్రా 6-15వ. రాజైన దర్యావేషు ఏలుబడియందు ఆరవ సంవత్సరము క్రీ.పూ. 515లో యెహోషువ జెరుబ్బాబేలుల నాయకత్వములో మందిర నిర్మాణము సమాప్తి చేయబడెను. ఎజ్రా 7:1లో ఈ సంగతులు జరిగిన పిమ్మట పారసీక దేశపు రాజైన అర్తహషస్త యొక్క యేలుబడిలో ఎజ్రా బబులోను దేశమునుండి యెరూషలేమునకు వచ్చాడని చెప్పబడినది. ఈ ఎజ్రా శెరాయా కుమారుడు, శెరాయా అజర్యా కుమారుడని చెప్పబడినది. ఈ ఎజ్రా ధర్మశాస్త్రమందు ప్రవీణతగల శాస్త్రి (7:6వ). అజర్యా అనగా యెహోవా సహాయకుడు అని శెరాయా అనగా యెహోవా మానక పనిచేయువాడు అని అర్థము. మానక పని చేయు యెహోవా సహాయకుడుగా ఉన్నాను ఆ ఇద్దరు రాజుల, కాలములు చూడగా మందిర నిర్మాణము తరువాత 58 సంవత్సరములకు ఎజ్రా వచ్చి మందిరమును అలంకరించినాడు. నిర్మాణము చేయబడిన మందిరము అలంకరించబడకుండా 58 సంవత్సరములు ఉండవచ్చునా ? మందిరము అలంకరించబడుట అనగా గ్రంథమందు ప్రావీణ్యత గలవారు, పరిచర్య చేయుటకు లేవీయులు, యాజకులు వారి వారి పనులు చేయుటకు మందిరములో అవసరము. ఈ 58 సంవత్సరములు వారు లేకపోయినందున మందిరములో కార్యములు చక్కగా జరుగలేదని గ్రహించగలము. ఈ దినములలో అనేక స్థానిక సంఘములందు గ్రంథమందు ప్రావీణ్యతగల సువార్తికులు,పెద్దలు లేరు. సరియైన వాక్య పరిచర్య లేదు. అందులకే మందిర కార్యములు సరిగా జరుగుట లేదు. 2 తిమో 2:15వ. దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడ నక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను / విభజించువానిగాను నిన్ను దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము. ధర్మశాస్త్రమందు ప్రవీణతగలవాడు అనగా సత్యవాక్యమును సరిగా ఉపదేశించువాడు. / విభజించువాడు అని అర్థము. ఎజ్రా ధర్మశాస్త్రమందు ప్రవీణతగల శాస్త్రి గనుక మందిరము అలంకరించుటకు దేవుడు బబులోను నుండి యెరూషలేముకు తీసికొని వచ్చాడు. 7-10 అధ్యాయములలో వాక్యమందు ప్రావీణ్యతగల పెద్దలను, మందిరములో పరిచర్య చేయుటకు లేవీయులను, యాజకులను ఏర్పరచగలిగాడు. ఎజ్రా వంటి నలుగురు ఇతర భక్తులు ఈ గ్రంథమందు కలరు. వారిని గూర్చి చూతము.

9

# షేష్బజ్జరు అనబడిన జెరుబ్బాబెలు

ఎజ్రా 1:8లో, పారసీక దేశపు రాజైన కోరెషు తన ఖజానాదారుడైన మిత్రిదాతు ద్వారా ఉపకరణములను బయటికి తెప్పించి లెక్క చేయించి, యూదులకు అధిపతియగు షేష్బజ్జరు చేతికి అప్పగించెను.

ఎజ్రా 5:15లో తాను అధికారిగా చేసిన షేష్బజ్జరు అనునతనికి అప్పగించి నీవు ఈ ఉపకరణములను తీసికొని యెరూషలేము పట్టణమందుండు దేవాలయమునకు పోయి దేవుని మందిరమును దాని స్థలమందు కట్టించుమని అతనికి ఆజ్ఞ ఇచ్చెను. ఈ రెండు భాగముల నుండి షేష్బజ్జరు, జెరుబ్బాబెలు ఒకరే అని తలంచవచ్చును. జెరుబ్బాబెలు జనన సంబంధమైన పేరు. ఇశ్రాయేలీయులు 70 సంవత్సరములు చెరలో ఉండగా జెరుబ్బాబెలు అనగా బబులోనులో చిగిరించినవాడు / పుట్టి పెరిగినవాడు అని అర్థము. ప్రకటన 19:8లో. ఆమె ధరించుకొనుటకు ప్రకాశములును నిర్మలములునైన సన్నపు నారబట్టలు ఆమెకియ్యబడెను; అవి పరిశుద్ధుల నీతి క్రియలు అని చెప్పబడినది. షేష్బజ్జరు అనగా శ్రమలలో సన్న నారవస్త్రములు కలవాడు అని అర్థము. జెరుబ్బాబెలు బబులోను చెరలో పుట్టి బానిసగా శ్రమలలో సన్ననార వస్త్రములు అనగా పరిశుద్ధ నీతి క్రియలతో జీవితము జీవించినవాడు కనుక మందిర పరిచర్యలో పాల్గొనుటకు దేవుడు ఎన్నుకొన్నాడు. జెకర్యా 4:6-10వ. జెరుబ్బాబెలునకు ప్రత్యక్షమగు యెహోవా వాక్కు ఇదే; శక్తిచేతనైనను బలముచేతనైనను కాక నా ఆత్మచేతనే ఇది జరుగునని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చెను. 7వ.లో మందిర నిర్మాణమునకు ఆటంకములు కలుగగా దేవుడు గొప్ప పర్వతమా, జెరుబ్బాబెలును అడ్డగించుటకు నీవు ఏ మాత్రపు దానవు ? నీవు చదును భూమివగుదువు; కృప కలుగును గాక, కృప కలుగును గాక అని జనులు కేకలు వేయగా అతడు పై రాయి తీసికొని పెట్టించును అని సెలవిచ్చాడు. 9-10 వ.లో జెరుబ్బాబెలు చేతులు ఈ మందిరపు పునాది వేసియున్నవి; అతని చేతులు ముగించును అన్నాడు. కార్యములు అల్పములైయున్న కాలమును తృణీకరించిన వాడెవడు? లోకమంతట సంచారము చేయు యెహోవా యొక్క యేడు నేత్రములు జెరుబ్బాబెలు చేతిలో గుండు నూలుండుట చూచి సంతోషించును. దేవుని కనుదృష్టి లోకమంతట సంచారము చేయుచుండగా చేతిలో గుండు నూలుతో గోడ కట్టువారు గోడను సరిచేయు రీతిగా తన జీవితమును వాక్యమగు గుండు నూలుతో సరిచేసికొనువాడుగా దేవునికి జెరుబ్బాబెలు కనిపించాడు. ఇది ఎంత మంచి సాక్ష్యము. ఈ గ్రంథమును చదువు ప్రతి ఒక్కరు ఆలాగు తన జీవితమును కట్టుకొనుటకు ప్రభువు సహాయము చేయునుగాక.

# యేషూవ అనబడిన యెహోషువ

యోజాదాకు కుమారుడైన యెహోషువ యేషూవ అని పిలువబడుచుండెను. ఎజ్రా 2వ అధ్యాయములో యాజకుడైన యేషూవ యూదా దేశమునకును తమ తమ పట్టణములకు పోవునట్లుగా సెలవు పొంది తన వంశస్థులగు రెండువేల ఎనిమిది వందల పండ్రెండుగురితో యెరూషలేమునకు వచ్చినవాడు. ఎజ్రా 3:2వ.లో యేషూవయును యాజకులైన అతని సంబంధులును జెరుబ్బాబెలుతో లేచి, దైవజనుడైన మోషే నియమించిన ధర్మశాస్త్రమునందు వ్రాయబడిన ప్రకారముగా దహన బలులు అర్పించుటకై బలిపీఠమును కట్టి బలులు అర్పించిరి. ఎజ్రా 3:8వ.లో యెరూషలేములో నుండు దేవుని యొక్క మందిరమునకు వారు వచ్చిన రెండవ సంవత్సరము రెండవ నెలలో జెరుబ్బాబెలును, యేషూవయు, చెరలో నుండి విడిపింపబడి యెరుషలేమునకు వచ్చిన వారందరును పని ఆరంభించి, యిరువది సంవత్సరములు మొదలుకొని పై యాడుగల లేవీయులను యెహోవా మందిరముయొక్క పనికి నిర్ణయించిరి. ఎజ్రా 3:9వ.లో యేషూవయు అతని కుమారులును అతని సహోదరులును, దేవుని మందిర పనికి నియమించబడిరి.

ఎజ్రా 4:1-3వ.లో యూదా వంశస్థులకును బెన్యామీయులకును విరోధులైన వారు దేవునికి మందిరమును కట్టుటకు రాగా యేషూవయు ప్రధానులు మేమే కూడుకొని పారసీక దేశపు రాజైన కోరెషు మాకిచ్చిన ఆజ్ఞ ప్రకారము ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు మందిరమును కట్టుదుమని వారితో చెప్పిరి. కాని విరోధులైనవారి ఆటంకములను బట్టి క్రీ.పూ. 535లో మందిరపు పని ఆగిపోయెను.

జెక 3:1-8వ.లో సాతాను ప్రధాన యాజకుడైన యెహోషువ కుడి పార్శ్వమున నిలువబడి యెహోషువ మీద ఫిర్యాదియై దోషమును మోపగా యెహోవా దూతయగు యేసుక్రీస్తు సాతానూ, యెహోవా నిన్ను గద్దించును, యెరూషలేమును కోరుకొను యెహోవా నిన్ను గద్దించును. యెహోషువ అగ్నిలోనుండి తీసిన కొరవివలెనే యున్నాడు అని చెప్పి యెహోషువ మలిన వస్త్రములు తీసివేయుడని ఆజ్ఞాపించి నేను నీ దోషమును పరిహరించి ప్రశస్తమైన వస్త్రములతో నిన్ను అలంకరించుచున్నాను అని సెలవిచ్చెను. వారు అతని తలమీద తెల్లని పాగా పెట్టి వస్త్రములతో అతనిని అలంకరించి తిరిగి ప్రధాన యాజకుడుగా నియమించాడు. యేషూవ జెరుబ్బాబెలు క్రీ.పూ. 520లో మందిరమును కట్టనారంభించిరి. దేవుని యొక్క ప్రవక్తలు వారితోకూడ నుండి సహాయము చేయుచు వచ్చిరి. క్రీ.పూ. 515లో మందిర నిర్మాణము ముగించిరి.

# ప్రవక్తలగు జెకర్యా హగ్గయిలు

హగ్గయి, జెకర్యాలు యెరూషలేములోని దేవుని మందిర నిర్మాణ విషయములో పురికొలుపగా క్రీ.పూ. 535లో ఆగిపోయిన పని క్రీ.పూ. 520లో తిరిగి ప్రారంభించబడినది.

హగ్గయి 1:1-5వ.లో రాజైన దర్యావేషు ఏలుబడియందు రెండవ సంవత్సరము ఆరవ నెల మొదటి దినమున క్రీ.పూ. 520లో ప్రవక్తయగు హగ్గయిద్వారా యూదా దేశము మీద అధికారియగు జెరుబ్బాబెలుకును ప్రధాన యాజకుడునైన యెహోషువకు యెహోవా వాక్కు ప్రత్యక్షమై యెహోవా ఆజ్ఞన ఇచ్చునదేమనగా సమయమింక రాలేదు. యెహోవా మందిరమును కట్టించుటకు సమయమింక రాలేదని యీ జనులు చెప్పుచున్నారే. ఈ మందిరము పాడైయుండగా మీరు సరంబీ వేసిన యిండ్లలో నివసించుటకు ఇది సమయమా ? మీ ప్రవర్తనను గూర్చి ఆలోచించుకొనుడి. యెహోవా జెరుబ్బాబెలు యొక్క మనస్సును, ప్రధాన యాజకుడగు యెహోషువ మనస్సును, శేషించిన జనులందరి మనస్సును ప్రేరేపింపగా క్రీ.పూ. 520లో 1:12-15వ.లో చెప్పబడినట్లు జెరుబ్బాబెలు యెహోషువ శేషించిన జనులందరు యెహోవా మాటలు ఆలకించి, భయభక్తులు పూని కూడి వచ్చి, రాజైన దర్యావేషు యొక్క యేలుబడియందు రెండవ సంవత్సరము ఆరవ నెల యిరువది నాలుగవ దినమున క్రీ.పూ. 520లో దేవుని మందిరపు పని చేయ మొదలుపెట్టిరి. ప్రవక్తయగు జెకర్యా యెహోషువను 3వ అధ్యాయములోను, జెరుబ్బాబెలును 4వ అధ్యాయములోను మందిర నిర్మాణమునకై పురికొల్పాడు.

జెకర్యా 3:1-8వ. అప్పుడు యెహోవా దూత యెహోషువకు ఈలాగు ఆజ్ఞనిచ్చెను. యెహోవా సెలవిచ్చునదేమనగా నా మార్గములలో నడుచుచు నేను నీకప్పగించిన దానిని భద్రముగా గైకొనిన యెడల, నీవు మందిరము మీద అధికారివై నా ఆవరణములను కాపాడువాడవగుదువు; మరియు ఇక్కడ నిలువబడు వారికి కలిగినట్లు నా సన్నిధిని నిలుచు భాగ్యము నీకిత్తును. యెహోషువ, నీ యెదుట కూర్చుండు నీ సహకారులు సూచనలుగా ఉన్నారు; నీవును వారును నా మాట ఆలకింపవలెను.

జెకర్యా 4:7-9వ. గొప్ప పర్వతమా, జెరుబ్బాబెలును అడ్డగించుటకు నీవు ఏ మాత్రపు దానవు ? నీవు చదును భూమివగుదువు; కృప కలుగునుగాక కృప కలుగును గాక అని జనులు కేకలు వేయగా అతడు పైరాయి తీసికొని పెట్టించును. యెహోవా వాక్కు మరల నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను. జెరుబ్బాబెలు చేతులు ఈ మందిరపు పునాది వేసియున్నవి. అతని చేతులు ముగించును అని పురికొల్పాడు.

# ఎజ్రా గ్రంథ వివరమైన విభజన

1-6 అధ్యాయములు :- యెరూషలేము మందిరము కట్టుట.

7-10 అధ్యాయములు :- మందిరమును అలంకరించుట.

అను రెండు భాగములుగా విభజించవచ్చును.

1-6 అ. యెరూషలేము మందిరము కట్టుట.

**1-2 అ. యెరూషలేముకు ప్రయాణము :-** 1అ. కోరేషు రాజు ఆజ్ఞాపించగా పనికి సిద్ధపడి 2అ. ప్రయాణమై బబులోను నుండి యెరూషలేముకు 1600 కిలోమీటరులు 49,897 మంది నడిచిపోయారు. 160 కిలోమీటరులు లేదా కేవలము 16 కిలోమీటరులు నడిచి వెళ్ళి సువార్త ప్రకటించుచూ ఆత్మలను సంపాదించి సంఘములను కట్టాలి అని దేవుడు సెలవిస్తే మనలో ఎంతమంది సిద్ధముగా వుంటారు. ఈ గ్రంథమును ధ్యానించు నీవు దేవుడు సెలవిచ్చిన వెళ్లి మందిర పని చేయుటకు సిద్ధముగా వున్నానని దేవునితో చెప్పుము. నీ తీర్మానమును దేవుడు అంగీకరిస్తాడు. మందిరములు కట్టడానికి యవనులను పురికొల్పాలి. ప్రతి సంవత్సరము కొన్ని నూతన మందిరాలు కట్టబడాలి. దేవుడు కనపరచిన విధముగా దేవుని నామ ఘనతకై మందిరములు కట్టబడాలి. వివరముగా చూస్తే క్రీ.పూ. 536లో దేవుని ఆజ్ఞ ప్రకారము కోరెషు రాజు ఆజ్ఞాపించగా (1:2 వ.) వుపకరణములను తీసికొని యెహోషువ జెరుబ్బాబేలుల నాయకత్వములో నుండి వివిధ గోత్రముల ప్రజలు 42,360 ప్రజలు + 7,337 సేవకులు + 200 గాయకులు = 49,897 (వీరిలో 4343 మంది యాజకులు, లేవీయులు ఉన్నారు). వీరందరు బయలుదేరి రెండవ అధ్యాయములో యెరూషలేముకు వచ్చి, తమ తమ పట్టణములలో కాపురము చేసిరి.

3వ అధ్యాయములో క్రీ.పూ. 535లో బలిపీఠము కట్టి దహనబలులు అర్పించిన పిమ్మట 20 సంవత్సరముల పైబడి వయసు వున్న లేవీయులైనవారు పనికి నిర్ణయించబడి మందిర పని ప్రారంభించిరి (3:8 వ.)

4వ అధ్యాయములో విరోధులైన వారి ద్వారా క్రీ.పూ. 535లోనే పని 15 సంవత్సరములు క్రీ.పూ. 520 వరకు నిలిచిపోయినది(4:24వ.) 5వ అధ్యాయములో ప్రవక్తలగు హగ్గయి, జెకర్యాలు ప్రోత్సహించగా విరోధులైన వారి ద్వారా ఆగిన పనిని యెహోషువ జెరుబ్బాబేలులు ప్రారంభించిరి.

5వ అధ్యాయములో కూడా ఆటంకములు వచ్చినను పని ఆగక కొనసాగినది.

4-5అ. పనికి ఆటంకాలు వివరమైన ధ్యానములో చూడగలము.

6వ అధ్యాయంలో పని సమాప్తమాయెను. రాజులు ఆటంకపరచక ప్రోత్సహించగా 6:15వ. రాజైన దర్యావేషు ఏలుబడియందు ఆరవ సంవత్సరము అదారు నెల మూడవ నాటికి క్రీ.పూ. 515లో మందిరము సమాప్తి చేయబడెను.

**7-10 అ. మందిర అలంకరణ - దిద్దుబాటు**

**7-8 అ. పనివారలను నిర్ణయించుట అను అలంకరణ :-** క్రీ.పూ. 520లో తిరిగి ప్రారంభించబడిన పని క్రీ.పూ. 515లో ముగించబడినది. కాని క్రీ.పూ. 458 వరకు అనగా కట్టబడిన తరువాత 58 సంవత్సరముల వరకు మందిర కార్యక్రమములను జరిగించుటకు అవసరమైన పనివారిని నిర్ణయించుట జరుగలేదు.

7వ అధ్యాయములో క్రీ.పూ. 458లో పారసీక దేశపు రాజైన అర్తహషస్త యొక్క ఏలుబడి యందు ఏడవ సంవత్సరము మొదటి నెల మొదటి దినమందు అతడు బబులోను నుండి బయలుదేరి, తన దేవుని కరుణాహస్తము తనకు తోడుగా నున్నందున అయిదవ నెల మొదటి దినమున యెరూషలేమునకు చేరెను. ఎజ్రా యెహోవా ధర్మశాస్త్రమును పరిశోధించి దాని చొప్పున నడుచుకొనుటను, ఇశ్రాయేలీయులకు దాని కట్టడలను విధులను నేర్పుటకును దృఢ నిశ్చయము చేసికొనెను.

మందిరమును అలంకరించుట అనగా మందిర కార్యక్రమములకు అవసరమైన పనివారిని నిర్ణయించుటయే. ఎజ్రా 7:6-7వ.లో ఈ ఎజ్రా యెహోవా అనుగ్రహించిన మోషే యొక్క ధర్మశాస్త్రమందు ప్రవీణతగల శాస్త్రి మరియు అతని దేవుడైన యెహోవా హస్తము అతనికి తోడుగా ఉన్నందున అతడు ఏ మనవి చేసినను రాజు అనుగ్రహించును. రాజైన అర్తహషస్త ఏలుబడియందు ఏడవ సంవత్సరమున ఇశ్రాయేలీయులు కొందరు యాజకులు కొందరు లేవీయులు గాయకులు, ద్వారపాలకులు, నెతీనీయులు మొత్తము 1756 మంది బయలుదేరి యెరూషలేము పట్టణమునకు వచ్చిరి. 7:27వ. వచనములో మందిరమును అలంకరించుటకు రాజుకు దేవుడు బుద్ధి పుట్టించాడు.

8వ అధ్యాయములో అవసరమైన పని వారిని పెద్దలను, లేవీయులను, ఉపదేశకులను, లేవీయులు చేయవలసిన సేవలో తోడ్పడుటకై దావీదును అధిపతులును నిర్ణయించిన నెతీనీయులను, ఉపకరణములను తీసికొని ఎజ్రా యెరూషలేము పట్టణమునకు వచ్చిన వివరములు చెప్పబడ్డాయి.

**9-10 అ. ప్రార్థన ద్వారా పవిత్రత - దిద్దుబాటు :-** 9 అ.లో ఎజ్రా సుదీర్ఘమైన ప్రార్థన చేశాడు. 1-3 వ. ఇశ్రాయేలీయుల పెద్దలు ఎజ్రా యొద్దకు వచ్చి ప్రజలు,

యాజకులు, లేవీయులు, ఈ దేశపు జనములలో కనానీయులు, హిత్తీయులు, పెరిజ్జీయులు, యెబూసీయులు, అమ్మోనీయులు, మోయాబీయులు, ఐగుప్తీయులు, అమోరీయులు అను వారి నుండి తమ్మును తాము వేరుపరచుకొనలేదు. వారు చేయు అసహ్య కార్యములను తామే చేయుచు, వారి కుమార్తెలను పెండ్లి చేసికొనుచు, తమ కుమారులకును తీసికొనుచు, పరిశుద్ధ సంతతిగా ఉండవలసిన తాము ఆ దేశపు జనులతో కలిసికొనినవారైరి. ఈ అపరాధము చేసిన వారిలో పెద్దలును, అధికారులును నిజముగా ముఖ్యులై యుండిరని చెప్పిరి. ఎజ్రా ఈ సంగతి విని తన వస్త్రమును పై దుప్పటిని చింపుకొని, తల వెంట్రుకలను, గడ్డపు వెంట్రుకలను పెరికి వేసికొని విభ్రాంతిపడి కూర్చుండి అందరి పాపములను తన మీద వేసికొని 9వ అధ్యాయములో ముందుగా తన తప్పులను గూర్చి ప్రార్థన చేశాడు. తరువాత ప్రజల పాపములను బట్టి దేవుడు శిక్షించినది కొంచెమే అని విడుదల ఇచ్చిన విధము సరియే అని అంగీకరించాడు. చివరిదిగా దేవుని నీతిని గూర్చి ప్రార్థించాడు.

**10 అ.లో అందరిలో దిద్దుబాటు చేసి వారిని పవిత్రపరిచాడు.**

10వ అధ్యాయములో ఎజ్రా యేడ్చుచు దేవుని మందిరము ఎదుట సాష్టాంగపడుచు, పాపమును ఒప్పుకొని చేసిన ప్రార్థన ఫలితముగా పురుషులు, స్త్రీలు, చిన్నవారు గొప్ప సమూహముగా అతని యొద్దకు కూడివచ్చి బహుగా ఏడ్చి ఎజ్రాతో ఇట్లనిరి. మేము దేశమందుండు అన్యజనములలోని స్త్రీలను పెండ్లి చేసికొని మా దేవుని దృష్టికి పాపము చేసితిమి; అయితే ఈ విషయములో ఇశ్రాయేలీయులు తమ నడవడి దిద్దుకొందురను నిరీక్షణ కద్దు. కాబట్టి యీ పని ధర్మశాస్త్రానుసారముగా జరుగునట్లు ఏలినవాడవైన నీ యోచనను బట్టియు, దైవాజ్ఞకు భయపడువారి యోచననుబట్టియు, ఈ భార్యలను వారికి పుట్టిన వారిని వెలివేయించెదమని మన దేవునితో నిబంధన చేసికొనెదము. లెమ్ము ఈ పని నీయాధీనములో నున్నది, మేమును నీతో కూడ నుందుము, నీవు ధైర్యము తెచ్చుకొని దీని జరిగించుమనగా ఎజ్రా లేచి, ప్రధాన యాజకులును లేవీయులను ఇశ్రాయేలీయు లందరును ఆ మాట ప్రకారము చేయునట్లుగా వారిచేత ప్రమాణము చేయించెను. కాబట్టి యిప్పుడు మీ పితరుల యొక్క దేవుడైన యెహోవా యెదుట మీ పాపమును ఒప్పుకొని, ఆయన చిత్తానుసారముగా నడుచుకొనుటకు సిద్ధపడి, దేశపు జనులను, అన్య స్త్రీలను విసర్జించి మిమ్మును మీరు ప్రత్యేకపరచుకొని యుండుడి అని చెప్పాడు. వెంటనే అన్యస్త్రీలను పెండ్లి చేసికొనిన వారందరు ఆలాగు చేయగా పవిత్రపరచు సంగతిని వారు సమాప్తము చేసిరి.

## ఎజ్రా గ్రంథము 1 అధ్యాయము (4+2+2+3=11 వచనములు)

అంశము :- మందిరము కట్టుటకు యెరూషలేముకు ప్రయాణము.

**1-4 వ. మందిరము కట్టించవలెనన్న ఆజ్ఞ :-** 1-2వ. యూదా ప్రజలు రాజులు చేసిన పాపమును బట్టి 2 దిన 36:14-21లో కల్దీయులు దేవుని మందిరమును తగులబెట్టి, యెరూషలేము ప్రాకారమును పడగొట్టి, దాని యొక్క నగరులన్నిటిని కాల్చివేసి, దానిలోని ప్రశస్తమైన వస్తువులన్నిటిని బొత్తిగా పాడుచేసిన సంగతులు వివరించబడినవి. ప్రజలందరూ బబులోనుకు చెరకొనిపోబడిరి. యిర్మీయా 25:11-12లో చెర 70 సంవత్సరములని చెప్పబడినది. క్రీ.పూ. 606 నుండి క్రీ.పూ. 536కు చెర ముగించబడినది. దాని 5:24-27వ. మెనే మెనే టెకేల్ ఉఫార్సీన్ అను గోడమీద వ్రాతల భావమును దానియేలు బబులోను చివరి రాజగు బెల్షస్సరుకు చెప్పాడు. అందులో ఫెరేస్ అనగా నీ రాజ్యము నీ యొద్దనుండి విభాగింపబడి మాదీయులకును పారసీకులకును యియ్యబడును అన్నాడు. ఈ మాట ప్రకారము దేవుడైన యెహోవా లోకమందున్న సకల జనములను పారసీక దేశపు రాజైన కోరెషుకు అప్పగించాడు. కోరెషు అనగా సూర్యుడు అని అర్థము. నీతి సూర్యుడైన క్రీస్తుయేసుకు ముంగుర్తుగా ఉన్నవాడని క్రీస్తును నమ్మినవాడని చూతుము. యెష 44:28లో కోరెషుతో నా మంద కాపరీ, నా చిత్తమంతయు నెరవేర్చువాడా అని చెప్పువాడను నేనే. యెరూషలేముతో నీవు కట్టబడుదువనియు దేవాలయమునకు పునాది వేయబడుననియు నేను చెప్పుచున్నాను అన్నాడు. కోరెషును మందకాపరీ అని పిలుచుటలో కాపరియైన క్రీస్తుకు పోలికగా ఉన్నాడని చూతుము, నా చిత్తమంత నెరవేర్చువాడా అనునది ఎంత గొప్ప మాట. అందరూ తమ స్వంత చిత్తమును నెరవేర్చగోరుదురు. కాని కోరెషు దేవుని చిత్తమును నెరవేర్చువాడు.

పారసీక దేశపు రాజైన కోరెషు ఏలుబడిలో మొదటి సంవత్సరమందు క్రీ.పూ. 536లో తన వాక్యము నెరవేర్చుటకై యెహోవా పారసీక దేశపు రాజైన కోరెషు మనస్సును ప్రేరేపింపగా అతడు తన రాజ్యమందంతట చాటింపు చేయించి వ్రాతమూలముగా యెహోవా లోకమందున్న సకల జనములను నా వశముచేసి, యూదా దేశమందున్న యెరూషలేములో తనకు మందిరమును కట్టించుమని నాకు ఆజ్ఞ ఇచ్చియున్నాడని ప్రకటన చేయించాడు.

**3-4వ.** కావున మీలో ఎవరు ఆయన జనులైయున్నారో వారు యెరూషలేమునకు బయలుదేరి, యెరూషలేములోని దేవుని మందిరమును, అనగా ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా మందిరమును కట్టవలెను; వారి దేవుడు వారికి తోడైయుండుగాక. ఆయన జనులైయున్న వారే అనగా రక్షించబడినవారే మందిరమును కట్టాలి. మందిరమును కట్టుటకు యెరూషలేముకు వెళ్ళుట అనగా 1600 కి.మీ.లు నడిచి వెళ్ళాలి.

ఇది గొప్ప సమర్పణతో కూడినది. యెరూషలేములోనుండు దేవుని మందిరమును కట్టించుటకై స్వేచ్ఛార్పణనుగాక ఆయా స్థలములలోనివారు తమ యొద్ద నివసించు వారికి వెండి బంగారములను, వస్తువులను, పశువులను ఇచ్చి సహాయము చేయవలెనని ఆజ్ఞాపించెను. స్వేచ్ఛార్పణలను మాత్రమే అంగీకరించాలి. రాజుగారు ప్రజలకు ఆజ్ఞాపించాడు. కాని యూదులు ఎవరిని అడుగలేదు. ఈ దినములలో మేము గొప్పవారము అని చెప్పుకొను బోధకులు టి.వి.లో ఎన్నో పర్యాయములు ప్రకటనలు గుప్పించుదురు.

**5-6వ. మందిర నిర్మాణమునకు అవసరమైన వస్తువులు సమకూర్చబడుట :-** మీలో ఎవరు ఆయన జనులైయున్నారో వారు బయలుదేరి, యెహోవా మందిరమును కట్టవలెను అను ఆజ్ఞ ప్రకారము పెద్దలు, యాజకులును, లేవీయుల మనస్సును దేవుడు ప్రేరేపించగా వారందరు కూడుకొనివచ్చి ఆలోచించి, యెరూషలేములో ఉండు యెహోవా మందిరమును కట్టుటకు ప్రయాణమైరి. కూడుకొని వచ్చుట అనగా వారి మధ్య ఏక మనసున్నది అని అర్థము. పలు కారణములను బట్టి వెళ్లలేకపోయినవారు వెండి ఉపకరణములను, బంగారును, పశువులను, ప్రశస్తమైన వస్తువులను ఇచ్చి వారికి సహాయము చేసిరి.

**7-8వ. మందిర నిర్మాణమునకు అవసరమైన వస్తువులతో బబులోనులో నుండి యెరూషలేముకు ప్రయాణమగుట :-** 2 దిన 36:18వ.లో బబులోనురాజు మందిరపు ఉపకరణములన్నిటిని మందిరపు నిధులలోనిదేమి రాజు నిధులలోనిదేమి అధిపతుల నిధులలోనిదేమి, ద్రవ్యమంతయు బబులోనుకు తీసికొనిపోయెను. నెబుకద్నెజరు యెరూషలేములో నుండి తీసికొని వచ్చి తన దేవతల యొక్క గుడియందుంచిన మందిరపు ఉపకరణములను రాజైన కోరెషు ఇప్పుడు బయటికి తెప్పించాడు. కోరెషు రాజు యూదా దేశము మీద అధికారిగా జెరుబ్బాబెలును (షేష్బజ్జరు), ప్రధాన యాజకుడుగా యెహోషువను నిర్ణయించి మందిర నిర్మాణమునకు అవసరమైన వస్తువులను అప్పగించాడు.

**9-11వ. మందిర ఉపకరణములను యెరూషలేమునకు తీసికొనిపోవుట :-** కోరెషు వాటి యొక్క లెక్క చేయించాడు. దేవుని సొమ్ముకు ఎప్పుడైనా సరియైన లెక్కలుండాలి. బంగారు వస్తువులును, వెండి వస్తువులును అన్నియు అయిదువేల నాలుగు వందలు, షేష్బజ్జరు బబులోను చెరలో నుండి విడిపింపబడిన వారితో కూడా కలిసి వీటన్నిటిని యెరూషలేమునకు తీసికొని వచ్చి అప్పగించాడు. వెండి సంఖ్యా 18:16వ. ప్రకారము విమోచనకు గురుతు. బంగారు దైవత్వమునకు గురుతు. సంఘములో విమోచించబడిన సహోదరులు దైవత్వము చేత నిండియుండాలి.

# ఎజ్రా గ్రంథము 2వ అధ్యాయము

**(20+15+7+16+7+5=70 వచనములు)**

**అంశము :- మందిరము కట్టుటకు యెరూషలేముకు ప్రయాణమైనవారి లెక్కల వివరము.**

**1-20 వ. ఇశ్రాయేలీయుల లెక్క :-** 1-2వ. బబులోను రాజైన నెబుకద్నెజరు చేత బబులోను దేశమునకు చెరగా తీసికొనిపోబడిన వారికి ఆ దేశమందు పుట్టినవారు అనగా బహుశా మూడవ తరమువారు కావచ్చును. చెరలో నుండి విడిపింపబడి తమ తమ పట్టణములకు పోవునట్లుగా సెలవు పొందారు. కోరెషు రాజు యూదా దేశముమీద అధికారిగా జెరుబ్బాబెలును (షేష్బజ్జరు), ప్రధాన యాజకుడునైన యెహోషువను నిర్ణయించినను వారితో పాటు మరికొందరు నెహెమ్యా శెరాయా రెయేలాయా మొర్దెకై బిల్షాను మిస్పెరేతు బిగ్వయి రెహూము బయనా అను వారిని కూడా నడిపించుటకు ఎన్నుకున్నారు. ఇశ్రాయేలీయుల యొక్క లెక్క మొత్తము 49,897.

3-20వ. ముందుగా సమాజపు లెక్క కుటుంబ ప్రధానుల పేరుతో లెక్కలు చెప్పబడ్డాయి. ఒక్కొక్క ప్రధాని తమ తమ కుటుంబములలో తమవారిని రక్షణ లోనికి నడిపించారు. వారికి మందిర నిర్మాణ పనిని గూర్చి ఆశ కలిగించారు. వారిని సిద్ధపరచి తమతో నడిపించగలిగారు. కొద్దిమంది వేలకొలది మందిని నడిపించగా ఇతరులు నడిపించినవారు వందలలోనే వున్నారు. ఈ భాగమును ధ్యానించు నీవు మీ కుటుంబములలో ఎంతమందిని మందిర నిర్మాణ పనికి ఆశ కలిగించారో ఒకసారి ఆలోచించండి. కొద్దిమందినైనా లేక ఒక్కరిద్దరినైనా నడిపించగలిగావా ? మీ ఇంటిలో ఎంతమందికి మందిర నిర్మాణ పనికి ఆశ కలిగించావో ఒకసారి ఆలోచించండి. మన పిల్లలు బాగా చదివి ఇంజనీర్లు కావాలి, డాక్టర్లు కావాలి అని వారికి ప్రేరణ కలిగించుచున్నారు. కాని మందిరపనికి ఎంత భారభరితులుగా చేయగలుగుతున్నాము. విలాప 3:27వ.లో నున్న యవ్వన కాలమున కాడిమోయుట నరునికి మేలు అను మాట గుర్తున్నదా ?

**21-35వ. గ్రామములవారీగా లెక్కలు :-** బేత్లెహేము వంశస్థులు, నెటోపా వంశస్థులు, అనాతోతు వంశస్థులు అని గ్రామముల వారిగా లెక్కలు చెప్పబడ్డాయి. బెత్లెహేము అనగా రొట్టెల ఇల్లు. రొట్టెలు దేవుని వాక్యము కనుక దేవుని వాక్యము చేత నిండినవారు ఆత్మసంబంధమైన మందిర నిర్మాణములకై అవసరము. నేటి దినములలో దేవుని వాక్యము చేత నిండిన పనివారు చాలా తక్కువ.

**36-42వ. పనివారల లెక్కలు :-** యాజకులు, లేవీయులు, గాయకులు, ద్వారపాలకులు ప్రత్యేకమైన సేవకులు అవసరముగా ఉన్నారు.

36-39వ. యాజకుల వంశస్థుల ప్రకారము వచ్చినవారి మొత్తము 4269.

40వ. లేవీయులలో వంశస్థులు అందరు కలసి డెబ్బది నలుగురు.

41వ. గాయకులలో ఆసాపు వంశస్థులు నూట ఇరువది యెనమండుగురు.

42వ. ద్వారపాలకులలో అందరి వంశస్తులు నూట ముప్పది తొమ్మండుగురు.

**43-58వ. నెతీనీయుల లెక్కలు :-** నెతీనీయులును సొలొమోను సేవకుల వంశస్థులును అందరును కలిసి మూడు వందల తొంబది యిద్దరు.

**59-65వ. సమాజపు మొత్తము లెక్క :-** సమాజము యొక్క లెక్క మొత్తము నలువది రెండు వేల మూడువందల అరువది మంది యాయెను. 65వ. వీరుగాక వీరి దాసులును దాసురాండ్రను ఏడువేల మూడు వందల ముప్పది యేడుగురు. 65-1వ. మరియు వారిలో గాయకులును గాయకురాండ్రును రెండు వందల మంది యుండిరి.

66-67వ. వారితో కూడా వచ్చిన వారి గుఱ్ఱములు, కంచర గాడిదలు, ఒంటెలు, గాడిదల లెక్కలు చెప్పబడ్డాయి.

68-69వ. కుటుంబ ప్రధానులు కొందరు యెరూషలేములో నుండు యెహోవా మందిరమునకు వచ్చి, దేవుని మందిరమును దాని స్థలములో నిలుపుటకు కానుకలను స్వేచ్ఛార్పణములుగా అర్పించిరి. పని నెరవేర్చుటకు తమ శక్తికొలది ఖజానాకు పదునారు వేల మూడువందల తులములు బంగారమును రెండు లక్షల యేబదివేల తులముల వెండిని యాజకుల కొరకు నూరు వస్త్రములను ఇచ్చిరి.

**70వ. యెరూషలేము చేరుట :-** క్రీ.పూ.536లో దేవుని ఆజ్ఞ ప్రకారము కోరెషు రాజు ఆజ్ఞాపించగా ఉపకరణములను తీసికొని జెరుబ్బాబేలుల యెహోషువ నాయకత్వములో 42,360 ప్రజలు + 7,337 సేవకులు + 200 గాయకులు మొత్తముగా 49,897 (వీరిలో 4343 మంది యాజకులు, లేవీయులు ఉన్నారు). వీరందరు బయలుదేరి యెరూషలేముకు కాలి నడకన వచ్చి, తమ తమ పట్టణములలో కాపురము చేసిరి.

# నేటి క్రొత్త నిబంధన కాల సంఘములు

మన మన గ్రామముల నుండి ఎంతమంది వేలకొలది మైళ్ళు వెళ్ళి సువార్త ప్రకటించు పనికి ఇష్టపూర్వకముగా అప్పగించుకున్నారు. ఆ దినములలో ప్రయాణ సాధనములు లేవు. భూమి మీద కాలి నడకన సముద్రము మీద పడవలో వెళ్ళాలి. ఈ దినములలో ప్రయాణమునకై ఎన్నో సదుపాయములున్నవి. ఎంతమందిమి వెళ్ళగలుగుచున్నాము. మన జిల్లాలలో కేంద్రమునుండి గ్రామములు అన్ని 1600 కాదు 160 కిలోమీటర్లు లోపే వుండవచ్చును. మీరు ఇష్టపడి తీర్మానించితే మన జిల్లాలోని ప్రతి గ్రామమునకు వెళ్ళివస్తూ సువార్తను ప్రకటించుచూ ఆత్మలను సంపాదించి సంఘములను కట్టవచ్చు. మీ తీర్మాణమును దేవుడు అంగీకరిస్తాడు. మీకు తోడుగా ఉండి పని జరిగిస్తాడు. తీర్మాణము మీదే.

సంఘములు ఏర్పడిన తరువాత నేటి సంఘములలో పాటలు పాడు వరము గల గాయకులు (అందరూ కాదు) గుర్తించబడి పాటలు నడిపించు పనికి నియమించబడాలి. మిగిలినవారు సమాజముతో కలిసి పాడవచ్చును. అలాగే లేవీయులు అనగా ఏ ఇతర పనుల మీద మనసుంచక సేవకొరకు ప్రత్యేకించబడి నియమించబడినవారు. యెహో 13:33వ. గమనించండి. లేవీ గోత్రమునకు మోషే స్వాస్థ్యము పంచిపెట్టలేదు; ఏలయనగా దేవుడైన యెహోవా వారితో సెలవిచ్చినట్లు ఆయనే అనగా ఆయన పనియే వారికి స్వాస్థ్యము. నేటి సంఘములలో ఆలాగు దేవుని పనికై ప్రత్యేకించబడిన సువార్తికులు అను పనివారున్నారు. మిగిలిన సహోదరుల మధ్య నుండి దేవుని చేత నియమించబడిన కాపరులు అనబడిన పెద్దలు ఉపదేశకులు ఉన్నారు. ఎఫె 4:1-3 వచనము చూడండి.

ఎఫె 4:13వ. “పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును... కొందరిని సువార్తికులనుగాను (ఒక నాయకుడు కాదు, కొందరు కాని సహోదరులు అందరు కాదు). కొందరిని కాపరులుగాను (ఒకే కాపరి / పాస్టర్ కాదు, కొందరు కాని, సహోదరులు అందరు కాపరులు కాదు). ఉపదేశకులనుగాను (ఒక ఉపదేశకుడు కాదు, కొందరు ఉపదేశకులు కాని సహోదరులు అందరు ఉపదేశకులు కాదు) నియమించెను. కొందరిని సువార్తికులుగాను, కొందరిని కాపరులుగాను, ఉపదేశకులుగాను వరము కలిగిన వారినే పరిశుద్ధాత్ముడు నియమించు విధము అపో. 13:1-3 వచనములలో చూతుము. అపో. 13:1-3వ. ‘1వ. అంతియొకయలోనున్న సంఘములో బర్నబా, నీగెరనబడిన సుమెయోను, కురేనీయుడైన లూకియ చతుర్థాధిపతియైన హేరోదుతో కూడా పెంచబడిన మన యేను, సౌలు అను ప్రవక్తలును బోధకులుగా ఉండిరి.

2వ. వారు ప్రభువును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ నేను బర్నబాను సౌలును పిలిచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడని వారితో చెప్పెను. 3వ. అంతట వారు ఉపవాసముండి ప్రార్థన చేసి వారిమీద చేతులుంచి వారిని పంపిరి.' ఈ ఏర్పాటు విషయములో సంఘమందు బోధనచేయు బోధకులు పాత్ర కలిగియుందురు.

అపో. 14:21-23వ. వారు ఆ పట్టణములో సువార్త ప్రకటించి అనేకులను శిష్యులనుగా చేసిన తరువాత, ప్రతి సంఘములో వారికి పెద్దలను ఏర్పరచి, ఉపవాసముండి, ప్రార్థన చేసి, వారు నమ్మిన ప్రభువునకు వారిని అప్పగించిరి. సువార్త ప్రకటించిన సువార్తికులు, సంఘమందు బోధచేయు బోధకులు పెద్దలను ఏర్పరచుటలో పాత్ర కలిగి యుందురు.

ఈలాగు నియమించబడిన 1) సువార్తికులకు, 2) కాపరులు అనబడిన పెద్దలు, పాస్టర్లకు సంఘములోని సహోదరులందరు లోబడి సంఘ కార్యక్రమములు జరిగించుటలో తోడ్పడాలి.

68-69వ. కుటుంబ ప్రధానులు కొందరు యెరూషలేములో నుండు యెహోవా మందిరమునకు వచ్చి, మందిరమును దాని స్థలములో నిలుపుటకు స్వేచ్ఛార్పణములను అర్పించిరి. పని నెరవేర్చుటకు తమ శక్తి కొలది ఖజానాకు పదునారు వేల మూడువందల తులముల బంగారమును రెండు లక్షల యేబదివేల తులముల వెండిని ఇచ్చిరి.

**మాసిదోనియా సంఘములు ప్రభువు పరిచర్యకై ఇచ్చుట గమనించండి.**

2 కొరిం 8:1-5వ. సహోదరులారా, మాసిదోనియ సంఘములకు అనుగ్రహింపబడియున్న దేవుని కృపనుగూర్చి మీకు తెలియజేయుచున్నాము.

2 ఏలగనగా, వారు శ్రమవలన పరీక్షింపబడగా, అత్యధికముగా సంతోషించిరి. మరియు వారు నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను.

3 ఈ కృప విషయములోను, పరిశుద్ధుల కొరకైన పరిచర్యలో పాలుపొందు విషయములో, మన:పూర్వకముగా మమ్మును వేడుకొనుచు, 4 వారు తమ సామర్థ్యము కొలదియే గాక సామర్థ్యము కంటె ఎక్కువగాను తమంతట తామే యిచ్చిరని మీకు సాక్ష్యమిచ్చుచున్నాను. 5 ఇదియు గాక మొదట ప్రభువునకు, దేవుని చిత్తము వలన మాకు, తమ్మునుతామే అప్పగించుకొనిరి; యింతగా చేయుదురని మేమనుకొనలేదు.

69వ. యాజకుల కొరకు నూరు వస్త్రములను ఇచ్చిరని చెప్పబడినది. ఆనాటి యాజకులు ప్రత్యేకించబడిన లేవీయులలోనివారే. కనుక ఈ దినములలో మనమధ్య ప్రత్యేకించబడిన సువార్తికులకు వస్త్రములు, సేవకులకు వారి జీవనమునకు అవసరమైన వాటిని ఇచ్చుటకు మనము మనసు కలిగియుందము.

# ఎజ్రా గ్రంథము 3 అధ్యాయము (7+6=13 వచనములు)

**అంశము : మందిర పునాది వేయబడుట:-** ఈ అధ్యాయములోని 16 వచనములలో మందిరము అను పదము 8 పర్యాయములు కలదు. 6వ వచనములో ఏడవ నెల మొదటి దినము నుండి యెహోవాకు దహన బలులు అర్పింప మొదలుపెట్టిరి. అయితే మందిరము యొక్క పునాది అప్పటికి ఇంకను వేయబడలేదు అని, 10వ వచనములో శిల్పకారులు మందిరము యొక్క పునాదిని వేయుచుండగా అని ఉన్నది. కనుక మందిర పునాది వేయబడుట ఈ అధ్యాయము యొక్క ముఖ్య అంశము.

ఎజ్రా 2:70వ.లో యాజకులు లేవీయులు జనులలో కొందరును గాయకులును, ద్వారపాలకులును నెతీనీయులును తమ పట్టణములకు వచ్చి కాపురము చేసిరి. ఇశ్రాయేలీయులందరు తమ తమ పట్టణములందు కాపురము చేసిరి. వెంటనే దేవుని మందిర పనిలో పాల్గొనలేదు. ప్రారంభములో ఉన్న ఉత్సాహము కొంత తగ్గినది కాబోలు. హెబ్రీ 11:15-16వ. చూడండి. హెబ్రీ 11:15 వారు (అబ్రహాము) ఏ దేశమునుండి వచ్చిరో ఆ దేశమును జ్ఞాపకమందుంచుకొన్న యెడల మరల వెళ్లుటకు వారికి వీలు కలిగియుండును. అయితే వారు మరి శ్రేష్ఠమైన దేశమును, అనగా పరలోక సంబంధమైన దేశమును కోరుచున్నారు. కనుక ఏ దేశము నుండి వచ్చిరో ఆ దేశమును జ్ఞాపకముందుంచు కొనక మరచిపోయిరని భావము. దూర ప్రాంతములకు వెళ్ళినవారు తరుచుగా తమ తమ గ్రామముల మీద మనసుంచి మాటి మాటికి రాకూడదు.

**1-7వ. బలిపీఠము కట్టి బలులు అర్పించుట :-** 3:1వ.లో ఏడవ నెలలో ఇశ్రాయేలీయులు తమ తమ పట్టణములకు వచ్చిన తరువాత జనులు ఏకమనస్సు కలిగినవారై యెరూషలేములో కూడి వచ్చిరి.

ఎఫె 4:1వ.లో కాబట్టి, మీరు సమాధానమును బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగినవారై యుండాలని చెప్పుచున్నాడు. మందిర నిర్మాణములో అందరిలో ఏకమనసు సమాధానము అవసరము. 2వ.లో యెహోషువయును యాజకులైన అతని సంబంధులును, జెరుబ్బాబెలును అతని సంబంధులును వచ్చారు. 9వ.లో యెహోషువయు అతని కుమారులును అతని సహోదరులును వచ్చారు. జెరుబ్బాబెలుల యెహోషువ సహోదరులు, కుమారులు, సంబంధికులు ఐక్యముగా మందిరపని విషయములో వచ్చిరో గమనించండి. నేటి దినములలోనూ మందిర పనులు చేయు సువార్తికులు, సంఘములలో పెద్దలు అందరిలో ఏకమనసు కలిగి వారి కుమారులును సహోదరులు వారి

సంబంధులు అందరు సమాధానముతో సంఘపనులు జరిగించుట ఎంతగా అవసరమో కదా. ఏకమనసు అందరితో సమాధానములేని కారణమున మందిర పనులు ముందుకు సాగుట లేదు. మందిరము యొక్క పునాదిని వేయుటకు ముందుగా బలిపీఠము కట్టబడి బలులు అర్పించబడినవి. లేవీ 1:9వ.లో 'అది యెహోవాకు ఇంపైన సువాసనగల దహనబలి యగునట్లు యాజకుడు దానినంతయు బలిపీఠము మీద దహింపవలెను' అన్నాడు. మందిర సంబంధమైన పనికొరకు పనివారు తమకు ఏమియు మిగిలించుకొనకుండా అంతయు మందిర బలిపీఠము మీద దహించివేయుట ముందుగా నేర్చుకొనవలెను. సమాధానబలి అర్పించుట అనగా అందరితో సమాధానము అవసరము. పాప పరిహారార్ధ బలి, అపరాధ పరిహారార్థ బలి అనగా విశ్వాసులమైన మనలో పాపమునకు తావు లేకుండా బలి అర్పణ జరగాలి. కనుక మందిర నిర్మాణ పనులు పవిత్రతతో జరగాలి.

2 దిన 36:19 వ.లో కల్దీయులు దేవుని మందిరమును తగులబెట్టి యెరూషలేము ప్రాకారమును పడగొట్టి, దానియొక్క నగరులను కాల్చివేసిరి. దానిలోని ప్రశస్తమైన వస్తువులన్నిటిని బొత్తిగా పాడుచేసిరి. కనుక ఇప్పుడు బలిపీఠము కట్టుట అవసరమైనది.

మత్తయి 5:23వ. 'కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణమునర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చిన యెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి మొదట వెళ్ళి నీ సహోదరునితో సమాధాన పడుము. అటు తరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము' అన్నాడు. కనుక బలియర్పించునపుడు సమాధానపడుట జరుగును. ఇది మందిర నిర్మాణములో అవసరము. కనుక పునాది వేయబడక ముందే బలిపీఠమునొద్ద బలి నర్పించుట జరిగించారు. అది ఏడవ నెల కనుక పర్ణశాల పండుగ దైవజనుడైన మోషే నియమించిన ధర్మశాస్త్రమునందు వ్రాయబడిన ప్రకారముగా అమావాస్యలకు యెహోవా యొక్క నియామకమైన పండుగలకు ప్రతిష్ఠితమైన దహన బలులను, ఒక్కొక్కడు తెచ్చిన స్వేచ్ఛార్పలను అర్పించుచు వచ్చిరి.

5-6వ. ఏడవ నెల మొదటి దినమునుండి యెహోవాకు దహన బలులు అర్పింప మొదలుపెట్టిరి. లేవీ 23:15-21వ. ప్రకారము ఏడవ నెలలో మొదటి దినము శృంగధ్వనుల పండుగ, పదియవ దినము పాపము నిమిత్తమైన ప్రాయశ్చిత్తార్థ దిన పండుగ. యేడవ నెల పదునయిదువ దినము మొదలుకొని యేడు దినములవరకు యెహోవాకు పర్ణశాలల పండుగను జరుపవలెను. లేవీ 23:24-34వ. 'నీవు ఇశ్రాయేలీయులతో ఇట్లనుము ఏడవ నెలలో మొదటి దినము మీకు విశ్రాంతి దినము. అందులో జ్ఞాపకార్థ శృంగధ్వని వినినప్పుడు మీరు పరిశుద్ధ సంఘముగా కూడవలెను.

25 అందులో మీరు జీవనోపాధియైన ఏ పనియు చేయుటమాని యెహోవాకు హోమము చేయవలెను. 26 మరియు యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను. 27 ఈ యేడవ నెల పదియవ దినము పాపము నిమిత్తమైన ప్రాయశ్చిత్తార్థ దినము. అందులో మీరు పరిశుద్ధ సంఘముగా కూడవలెను. మిమ్మును మీరు దు:ఖపరచుకొని యెహోవాకు హోమము చేయవలెను. 28 ఆ దినమున మీరు ఏ పనియు చేయకూడదు. మీ దేవుడైన యెహోవా సన్నిధిని మీరు మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేసికొనుటకై అది ప్రాయశ్చిత్తార్థ దినము. 29 ఆ దినమున తన్ను తాను దు:ఖపరచుకొనని ప్రతివాడు తన ప్రజలలో నుండి కొట్టివేయబడును. 30 ఆ దినమున ఏ పనినైనను చేయు ప్రతివానిని వాని ప్రజలలో నుండకుండ నాశము చేసెదను. 31 అందులో మీరు ఏ పనియు చేయకూడదు. అది మీ సమస్త నివాసములలో మీ తరతరములకు నిత్యమైన కట్టడ. 32 అది మీకు మహావిశ్రాంతి దినము. మిమ్మును మీరు దు:ఖపరచుకొనవలెను. ఆ నెల తొమ్మిదవ నాటి సాయంకాలము మొదలుకొని మరుసటి సాయంకాలము వరకు మీరు విశ్రాంతి దినముగా ఆచరింపవలెను. 33 మరియు యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను. 34 నీవు ఇశ్రాయేలీయులతో ఇట్లనుము ఈ యేడవ నెల పదునయిదవ దినము మొదలుకొని యేడు దినములవరకు యెహోవాకు పర్ణశాలల పండుగను జరుపవలెను.'

7వ. అలాగే మందిరమునకు అవసరమైన దేవదారు మ్రానులను లెబానోను నుండి సముద్రము మీద యొప్పే పట్టణమునకు తెప్పించుటకు వడ్రవారికిని ద్రవ్యము నిచ్చిరి.

యూదా రాజైన ఆహాజు 2 దిన 28:24-25వ.లో దేవుని మందిరపు ఉపకరణములను సమకూర్చి వాటిని తెగగొట్టించి మందిరపు తలుపులను మూసివేయించి యెరూషలేము నందంతట యూదా దేశములోని పట్టణములన్నిటిలోను అతడు అన్యుల దేవతలకు ధూపము వేయుటకై బలిపీఠములను కట్టించి, తన పితరుల దేవుడైన యెహోవాకు కోపము పుట్టించాడు. ఈ దినములలో మందిరమునకు తలుపులు వేయించు స్థితి మనలో ఏ ఒక్కరి ద్వారా రాకూడదు. మనకెంత నష్టము, కష్టము వచ్చినను భరించుదము కాని మందిరమునకు మన ద్వారా తలుపులు వేయబడరాదు.

**8-13వ. మందిరము పునాదివేయుట :-** ఏడవ నెలలో ఇశ్రాయేలీయులు తమ తమ పట్టణములకు వచ్చిన తరువాత జనులు... 8వ.లో రెండవ సంవత్సరము రెండవ నెలలో యెరూషలేములో నుండు మందిరమునకు జెరుబ్బాబెలును, యోజాదాకు కుమారుడైన యెహోషువయు, వచ్చి చెరలో నుండి విడిపింపబడిన వారందరితో పని ఆరంభించిరి.

మందిర పని ఆరంభించక ముందు 7 నెలలు అనగా సంపూర్ణ కాలము బలిపీఠము మీద బలులు అర్పించుచు పండుగలను ఆచరించుచు వచ్చిరి. శృంగధ్వనుల పండుగ – శృంగము అనగా కొమ్ము. కొమ్ముతో ధ్వనిచేయుట సువార్త ప్రకటించుటయే. (ప్రభువు రెండవ రాకడను కూడా సూచించును). మన పాపముల నిమిత్తము బలియైన క్రీస్తును తలంచి ఆయన కల్వరిలో చేసిన ప్రాయశ్చిత్తమును తలపోసికొని స్వీకరించుటయే ప్రాయశ్చిత్త దిన పండుగ. ఏడు దినముల (సంపూర్ణ కాలము) పర్ణశాలల పండుగ ఆచరించుట సంపూర్ణ కాలము పరలోకములో ప్రభువుతో నుండుటను సూచించును.

యెహోవా మందిరము యొక్క పనికి యిరువది సంవత్సరముల వారిని నిర్ణయించుట యవ్వన కాలమును సూచించును. 2 తిమో 2:22వ. నీవు యవనేచ్ఛలనుండి పారిపొమ్ము. పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయు వారితో కూడ నీతిని, విశ్వాసమును, ప్రేమను, సమాధానమును వెంటాడుము అన్నాడు. కనుక యవనులు చాలా జాగ్రత్తగా పవిత్ర హృదయులై వుండాలి.

10వ. శిల్పకారులు యెహోవా మందిరము యొక్క పునాదిని వేయుచుండగా ఇశ్రాయేలు రాజైన దావీదు నిర్ణయించిన విధి చొప్పున తమ వస్త్రములు ధరించుకొనినవారై యాజకులు యెహోవాను స్తోత్రము చేసిరి. మందిర పునాది వేయుట అనగా నేర్పరియైన శిల్పకారియగు పౌలువలె శిల్పకారులముగా సువార్త ప్రకటన చేసి ఆత్మలను సంపాదించుటయే.

11వ. సువార్త ప్రకటన ద్వారా ఆత్మలు సంపాదించబడగా నిరంతరము దేవుని కృప నిలుచునని పాడుచు యెహోవాను స్తుతించిరి. మందిరము పునాది వేయబడుట చూచి, జనులు గొప్ప శబ్దముతో యెహోవాకు స్తోత్రము చేసిరి.

12–13వ. మునుపటి మందిరమును చూచిన యాజకులలోను లేవీయులలోను కుటుంబ ప్రధానులలోను వృద్ధులైన అనేకులు, ఇప్పుడు వేయబడిన యీ మందిరము యొక్క పునాదిని చూచి గొప్ప శబ్దముతో ఏడ్చిరి. పని చేయలేని వృద్ధులైనవారు పురికొలుపు వారుగా ఉండాలి. కాని ఈలాగు ఏడ్చుట పని చేయువారికి నిరుత్సాహము కలిగించును.

హగ్గ 2:9. ఈ కడవరి మందిరము యొక్క మహిమ మునుపటి మందిరము యొక్క మహిమను మించునని యెహోవా సెలవిచ్చుచున్నాడు. ప్రధానులలోను వృద్ధులైనవారు ఏడ్చి అందరిని నిరుత్సాహపరచిరి.

# ఎజ్రా గ్రంథము 4వ అధ్యాయము (8+8+8=24 వచనములు)

**అంశము :- ఆటంకముల మధ్య మందిరము కట్టుపని నిలిచిపోవుట.**

**1-8వ. ఇశ్రాయేలీయుల శత్రువులు అభ్యంతరము చేయుట :-**

**1-2వ. ఇశ్రాయేలీయుల శత్రువులు మందిరము కట్టెదమనుట :** అంతట యూదా వంశస్థులకును బెన్యామీనీయులకును విరోధులైనవారు చెర నివారణయైనవారు యెహోవాకు ఆలయమును కట్టుచున్న సంగతి విని ప్రధానుల యొద్దకును వచ్చి మీరు ఆశ్రయించునట్లు మేమును మీ దేవుని ఆశ్రయించువారము. ఇచ్చటికి మమ్మును రప్పించిన అష్షూరు రాజైన ఏసర్హద్దోను యొక్క కాలము మొదలుకొని మేము యెహోవాకు బలులు అర్పించువారము. మేమును మీతో కలిసి కట్టెదమని చెప్పిరి. 2 దిన 36:19 వచనములలో మందిరము బలిపీఠము 70 సంవత్సరముల క్రితము వీరి పితరుల కాలములో కాల్చబడ్డాయి. వీరు ఏ రీతిగా బలులు అర్పించగలరు. కనుక వీరు అబద్ధమాడుచున్నారు.

3-4వ. కోరెషు రాజుగారి ఆజ్ఞ ఎవరు ఆయన జనులైయున్నారో వారే కట్టాలి అన్నాడు. కనుక జెరుబ్బాబెలు యెహోషువ మీరు మాతో కలిసి మా దేవునికి మందిరమును కట్టుటకు నిమిత్తము లేదని మేమే కూడుకొని పారసీక దేశపు రాజైన కోరెషు మాకిచ్చిన ఆజ్ఞ ప్రకారము యెహోవాకు మందిరమును కట్టుదుమని వారితో చెప్పిరి. దేశపు జనులు యూదా వంశస్థులకు ఇబ్బంది కలుగజేసి కట్టుచున్న వారిని బాధపరచిరి. యోహా 16:33వ. లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాను, కనుక నాయందు మీకు సమాధానము కలుగును అని ప్రభువు అభయమిచ్చాడు. 5-8వ. పారసీక దేశపు రాజైన కోరెషు యొక్క దినములన్నిటిలోను పారసీక దేశపు రాజైన దర్యావేషు యొక్క పరిపాలన కాలము వరకు క్రీ.పూ. 535-520 వరకు వారి ఉద్దేశమును భంగపరచుటకై వారు మంత్రులకు లంచములిచ్చిరి. వారి మీద అబద్ధముగా తప్పుమోపిరి.

**9-16వ. రాజైన అర్తహషస్తకు అభ్యంతరములను తెలుపు ఉత్తరము :-** 9-12వ. యెరూషలేమునకు వచ్చినవారు మందిరముతో బాటు పట్టణమును కూడా కట్టుచుండిరి. మందిరమును మాత్రమే కట్టి ముగించిన తరువాత వారి ఇండ్లను కట్టుకొనిన సరిగా వుండేది. 13-16వ. ఈ పట్టణమును కట్టి దాని ప్రాకారమును నిలువబెట్టిన యెడల వారు శిస్తుగాని, సుంకముగాని, పన్నుగాని యియ్యకయుందురు. అప్పుడు రాజునకు రావలసిన పైకము నష్టమగును. మేము రాజుయొక్క ఉప్పు తిన్నవారము గనుక రాజునకు నష్టము రాకుండా మేము చూడవలెనని వ్రాసిన యుత్తరము రాజుకు పంపిరి. ఇది పూర్తిగా అబద్ధము.

ఈ రాజైన అర్తహషస్త చక్రవర్తిగా 120 సంస్థానములను క్రీ.పూ. 465-425 వరకు పాలించిన చక్రవర్తి కాదు. ఒక ప్రాంతమునకు ఉన్న రాజుగా తలంచాలి. 15-16వ. తమ పూర్వీకులు వ్రాయించిన రాజ్యపు దస్తావేజులను చూచిన యెడల, ఈ పట్టణపు వారు తిరుగుబాటు చేయువారుగాను, రాజులకును, దేశములకును హానిచేయు వారుగా, కలహకారులుగా కనబడుదురని, అందువలననే యీ పట్టణము నాశనము పొందెననియు రాజ్యపు దస్తావేజుల వలననే తమకు తెలియవచ్చును అని అబద్ధములు వ్రాసిరి.

**17-20వ. మందిరపు పని నిలిపివేయుట :-** 17-20వ. రాజు పంపిన జవాబు వివరము. 17 అప్పుడు రాజు మంత్రియగు రెహూమునకును వ్రాయించి సెలవిచ్చినదేమనగా 18 మీరు మాకు పంపిన ఉత్తరమును శాంతముగా చదివించుకొన్నాము. 19 అందు విషయమై మా యాజ్ఞను బట్టి వెదకగా, ఆదినుండి ఆ పట్టణపు వారు రాజుల మీద కలహమును తిరుగుబాటును చేయువారని మాకు అగుపడినది. 20 మరియు యెరూషలేము పట్టణమందు బలమైన రాజులు ప్రభుత్వము చేసిరి. వారు నది యవతలి దేశములన్నిటిని ఏలినందున వారికి శిస్తును సుంకమును, పన్నును చెల్లుచుండెను.

**21-24వ. పట్టణము కట్టక మానవలెనని ఆజ్ఞ : మందిరపు పని నిలిచిపోవుట :-**

21 కాబట్టి యిప్పుడు ఆ మనుష్యులు ఆ పని చాలించి, మేము సెలవిచ్చు వరకు ఆ పట్టణమును కట్టక మానవలెనని ఆజ్ఞాపించుడి అని సెలవిచ్చెను. 23 రాజైన అర్తహషస్త పంపించిన యుత్తరము యొక్క ప్రతి రెహూమునకును షిమ్షయికిని వినిపింపబడినప్పుడు వారు త్వరగా యెరూషలేములో నున్న యూదుల యొద్దకు వచ్చి, బలవంతము చేతను అధికారము చేత పట్టణము కట్టుపని కాక, వారు మందిరపు పని ఆపునట్లు చేయగా 24 యెరూషలేములో నుండు దేవుని మందిరపు పని నిలిచిపోయెను. కాని పట్టణములో తమ తమ ఇండ్లు కట్టుకొనిరని హగ్గయి గ్రంథము వలన తెలియును. హగ్గయి 1:4వ.లో ఈ మందిరము పాడైయుండగా మీరు సరంబీవేసిన యిండ్లలో నివసించుటకు ఇది సమయమా ? అనగా తమ ఇండ్లు కట్టుకొని ముగించి అందులో నివసించుచున్నారు. మీ ప్రవర్తనను గూర్చిఆలోచించుకొనుడి అన్నాడు. దీని భావము మందిరము కట్టుటకు వచ్చినవారు మందిరమును పాడుగానే వుంచి తమ కొరకు ఇండ్లు కట్టుకొని మందిరమును కట్టుటకు సమయము ఇంకా రాలేదని చెప్పుట సమంజసమా ? ఈలాగున పారసీక దేశపు రాజైన దర్యావేషు ఏలుబడియందు రెండవ సంవత్సరమువరకు క్రీ.పూ. 535-520 వరకు 15 సంవత్సరములు ఆ పని నిలిచిపోయెను.

# ఎజ్రా గ్రంథము 5వ అధ్యాయము (5+5+5+2=17 వచనములు)

**అంశము :- ఆగిపోయిన మందిరమును మరలా కట్టనారంభించగా ఆటంకములు కలుగుట.** (క్రీ.పూ. 520లో ప్రవక్తలగు హగ్గయి, జెకర్యాల పురికొలుపుతో 15 సం॥ ఆగిన మందిర పని మరల ప్రారంభము)

1-5వ. ప్రవక్తలు సహాయము చేయుచుండగా మందిరమును కట్టనారంభించిరి:-

1-2వ. ప్రవక్తలైన హగ్గయి జెకర్యా యూదులకు యెహోవా నామమును ప్రకటింపగా యెషూవయు జెరుబ్బాబెలు లేచి దేవుని మందిరమును కట్టనారంభించిరి. మరియు దేవుని యొక్క ప్రవక్తలు వారితో ఉండి సహాయము చేయుచు వచ్చిరి. హగ్గయి, జెకర్యాలు ప్రకటించిన వివరములు హగ్గయి, జెకర్యా గ్రంథములలో ఉన్నవి.

జెకర్యా 3:1-8వ. యెహోషువ మైల బట్టలను యెహోవా దూత తీసివేసి ప్రశస్త వస్త్రములను ధరింపజేసిన సంగతిని గతములో చూచితిమి. నా మార్గములలో నడుచుచు నేను నీ కప్పగించిన దానిని భద్రముగా గైకొనినయెడల, నీవు మందిరము మీద అధికారివై నా ఆవరణములను కాపాడువాడవగుదువు; మరియు నా సన్నిధిని నిలుచు భాగ్యము నీకిత్తును అని యెహోవా దూత చెప్పి బలపరచాడు.

జెకర్యా 4:7-9వ.లో గొప్ప పర్వతమా, జెరుబ్బాబెలును అడ్డగించుటకు నీవు ఏ మాత్రపుదానవు ? నీవు చదును భూమివగుదువు; కృప కలుగును గాక, కృప కలుగును గాక అని జనులు కేకలు వేయగా అతడు పైరాయి తీసికొని పెట్టించును. జెరుబ్బాబెలు చేతులు ఈ మందిరపు పునాది వేసియున్నవి, అతని చేతులు ముగించును అని పురికొల్పాడు.

హగ్గయి మొదటి అధ్యాయములో యెహోవా మందిరమును కట్టించుటకు సమయమింక రాలేదని చెప్పుచూ తమ ఇండ్లు కట్టుకొని అందులో నివసించుచున్నాం అని దేవుడు చెప్పగా ఆలకించి, యెహోవాయందు భయభక్తులు పూని కూడివచ్చి, రాజైన దర్యావేషు యొక్క యేలుబడి యందు రెండవ సంవత్సరము ఆరవ నెల యిరువది నాలుగవ దినమున క్రీ.పూ. 520లో దేవుని మందిరపు పని చేయ మొదలుపెట్టిరి. యెహోవా వాక్కు మూడు సార్లు ప్రత్యక్షమై 1. యెహోవా వాక్కు మొదటి సారి 1:3-15వ.లో ప్రత్యక్షమై ప్రవర్తన సరిగా ఉండాలని చెప్పాడు. 2. యెహోవా వాక్కు 2:1-9వ.లో రెండవ సారి ప్రత్యక్షమై పని జరిగించాలని చెప్పాడు.

3. యెహోవా వాక్కు మూడవసారి ప్రత్యక్షమై 2:10-19వ.లో పనిలో పవిత్రత ఉండాలని చెప్పాడు. 4. యెహోవా వాక్కు నాల్గవ సారి ప్రత్యక్షమై 2:20-23వ.లో

జెరుబ్బాబెలుకు ప్రతిష్టత జరిపించాడు. ఏదైనా పని జరుగుటకు ప్రవర్తన, పని జరిపించుట, పవిత్రత, ప్రతిష్టత అవసరమని చూచుచున్నాము.

అది నైతిక ప్రవర్తనగాని, ప్రభువు అప్పగించిన పనిని చేయుటలోని ప్రవర్తనను గూర్చిగాని తరుచుగా మనము ఆలోచించుకొనాలి. ప్రవర్తననుగూర్చి ఆలోచించుకొనుడి అను ప్రవక్తల హెచ్చరికలు ఈ దినములలో తరుచుగా మనకు వినబడాలి. అప్పుడే గలతీ 5:22లోను మార్కు 7:22లోను మనలో ఉన్న నైతిక ప్రవర్తన లోపములు, ప్రభువు పరిచర్యలోని లోపములు దిద్దబడును. ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభించబడును.

3-5వ. అధికారులైన తత్తెనైయును షెతర్బోజ్నయియును యూదులయొద్దకు వచ్చి ఈ మందిరమును కట్టుటకును ఈ ప్రాకారమును నిలుపుటకును ఎవరు సెలవిచ్చిరని వివరములు తెలిసికొనిరి. దేవుడు వారి పెద్దల మీద తన దృష్టి యుంచినందున ఆ సంగతిని గూర్చి దర్యావేషు ఎదుటికి తెచ్చువారు ఆజ్ఞనొందువరకు అధికారులు వారిని పని మాన్పింపలేదు.

**6-15వ. దర్యావేషు రాజునకు అధికారులు మందిర పనిని గూర్చి ఫిర్యాదుగా పంపిన ఉత్తరము.**

అధికారులైన తత్తెనైయును షెతర్బోజ్నయియును, రాజైన దర్యావేషునకు ఉత్తరము వ్రాసి పంపిరి. 'మేము యూదా ప్రదేశములోనికి వెళ్లితిమి, అక్కడ మహాదేవుని యొక్క మందిరము ఉన్నది; అది గొప్ప రాళ్ళచేత కట్టబడినది. మరియు ఈపని త్వరగా జరుగుచు వారిచేతిలో వృద్ధియగుచున్నది. ఈ మందిరమును కట్టుటకును ఈ ప్రాకారములను నిలుపుటకును ఎవరు మీకు సెలవిచ్చిరని మేము అక్కడ ఉన్న పెద్దలను అడిగితిమి. వారు ఈలాగున ప్రత్యుత్తరమిచ్చిరి. మేము భూమ్యాకాశముల దేవుని యొక్క సేవకులమై అనేక సంవత్సరముల క్రిందట గొప్ప రాజగు సొలొమోను కట్టించిన మందిరమును మరల కట్టుచున్నాము. మా పితరులు దేవునికి కోపము పుట్టించినందున ఆయన వారిని నెబుకద్నెజరను బబులోను రాజు చేతికి అప్పగించెను. అతడు ఈ మందిరమును నాశనము చేసి జనులను బబులోను దేశములోనికి చెరపట్టుకొనిపోయెను. అయితే రాజైన కోరెషు దేవుని మందిరమును తిరిగి కట్టుటకు ఆజ్ఞ ఇచ్చెను. తాను అధికారిగా చేసిన షేష్బజ్జరు అనునతనికి యెరూషలేము పట్టణమందుండు దేవుని మందిరమునకు పోయి దాని స్థలమందు కట్టించుమని అతనికి ఆజ్ఞ ఇచ్చెను.

16-17వ. యెరూషలేములోనుండు మందిరమును కట్టుటకు రాజైన కోరెషు నిర్ణయము చేసెనో లేదో అని రాజు యొక్క ఖజానాలో వెదకవలెనని కోరిరి.

# ఎజ్రా గ్రంథము 6వ అధ్యాయము (5+3+2+2+2+2+6=22 వచనములు)

**అంశము : మందిర నిర్మాణము సమాప్తియై ప్రతిష్టించబడుట :-** ముందుగ జరిగిన కొన్ని సంగతులు గమనింతుము. ఎజ్రా 4:1-13వ.లో యూదా వంశస్థులకు బెన్యామీనీయులకు విరోధులైనవారు ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు ఆలయమును కట్టుచున్న సంగతి విని జెరుబ్బాబెలు నొద్దకును పెద్దలలో ప్రధానుల యొద్దకు మేము యెహోవాకు బలులు అర్పించువారము, మేమును మీతో కలిసి కట్టెదమని చెప్పిరి. అందుకు యూదులు మీరు మాతో కలిసి మా దేవునికి మందిరమును కట్టుటకు నిమిత్తము లేదని చెప్పిరి. అహష్వేరోషు ఏలనారంభించినప్పుడు విరోధులైనవారు యూదా దేశస్థులను గూర్చి యెరూషలేము పట్టణపు వారిని గూర్చి మంత్రియగు రెహూమును లేఖకుడగు షిమ్షయియు యూదులమీద తప్పు మోపి యెరూషలేము సంగతిని గూర్చి ఉత్తరము వ్రాసి రాజైన అర్తహషస్త యొద్దకు పంపిరి. ఆ ఉత్తరములో నది యివతల నున్న తమ దాసులమైన మేము రాజైన తమకు తెలియజేయునదేమనగా తమ సన్నిధి నుండి మా యొద్దకు వచ్చిన యూదులు యెరూషలేమునకు వచ్చి, తిరుగుబాటు చేసిన ఆ చెడు పట్టణమును కట్టుచున్నారు. తమ పూర్వీకులు వ్రాయించిన రాజ్యపు దస్తావేజులను చూచిన యెడల, ఈ పట్టణపువారు తిరుగుబాటు చేయువారు, రాజులకు దేశములకు హాని చేయువారు, కలహకారులుగా కనబడుదురని వారు శిస్తుగాని, సుంకముగాని, పన్నుగాని యియ్యకయుందురు, కనుక రాజునకు పైకము నష్టమగును అని తెలిపిరి. మందిరమును కట్టుటకు వచ్చిన యూదులు మందిరమునే కాక తమ కొరకు ఇండ్లను కూడా కట్టుచుండిరి. నిజానికి ప్రజలకు మంచి వస్తువుల చేత నింపబడి కట్టబడిన ఇండ్లను దేవుడు ఇస్తానని ద్వితీ 6:11వ.లో చెప్పాడు. కనుక తాము తమ కొరకు కట్టవలసిన అవసరము లేదు. 'నీ దేవుడైన యెహోవా నీ పితరులైన అబ్రహాము ఇస్సాకు, యాకోబులతో చేసిన ప్రమాణమును బట్టి నిన్ను ఆ దేశములో ప్రవేశపెట్టి, నీవు కట్టని గొప్పవగు మంచి పురములను నీవు నింపని మంచి ద్రవ్యముల చేత నింపబడిన ఇండ్లను, నీవు త్రవ్వకపోయినను త్రవ్వబడిన బావులను, నీవు నాటని ద్రాక్షతోటలను ఒలీవల తోటలను నీకిచ్చిన తరువాత నీవు తిని తృప్తిపొందినపుడు దాసుల గృహమైన ఐగుప్తు దేశములోనుండి నిన్ను రప్పించిన యెహోవాను మరువకుండ నీవు జాగ్రత్తపడుము. (ద్వితీ 6:10-12వ.)

ఎజ్రా 4:23-24వ.లో రాజైన అర్తహషస్త జవాబుగా పంపించిన యుత్తరములో మేము సెలవిచ్చువరకు ఆ పట్టణమును కట్టక మానవలెనని ఆజ్ఞాపించుడి అన్నాడు. ఆ

యుత్తరము యొక్క ప్రతి మంత్రియగు రెహూమునకును లేఖకుడగు షిమ్షయికిని వీరి పక్షముగా నున్న వారికిని వినిపింపబడగా వారు త్వరగా యెరూషలేములో నున్న యూదుల యొద్దకు వచ్చి, బలవంతము చేతను, అధికారము చేతను వారు పని ఆపునట్లు చేయగా యెరూషలేములో నుండు దేవుని మందిరపు పని నిలిచిపోయెను. ఈలాగున పారసీక దేశపు రాజైన దర్యావేషు ఏలుబడియందు రెండవ సంవత్సరము వరకు క్రీ.పూ. 535-520 వరకు 15 సంవత్సరములు ఆ పని నిలిచిపోయెను.

ఎజ్రా 5:6-17వ. అధికారియైన తత్తెనైయును షెతర్బోజ్నయియును, రాజైన దర్యావేషునకు ఉత్తరము వ్రాసి పంపిరి. దాని నకలు 'మేము యూదా ప్రదేశములోనికి వెళ్లితిమి, అక్కడ మహాదేవుని యొక్క మందిరము ఉన్నది; అది గొప్ప రాళ్ల చేత కట్టబడినది, గోడలలో మ్రానులు వేయబడినవి మరియు ఈ పని త్వరగా జరుగుచు వారి చేతిలో వృద్ధియగుచున్నది. ఈ మందిరమును కట్టుటకును ఈ ప్రాకారములను నిలుపుటకును ఎవరు మీకు సెలవిచ్చిరని ప్రశ్నించగా బబులోను రాజైన కోరెషు ఏలుబడిలో మొదటి సంవత్సరమందు రాజైన కోరెషు దేవుని మందిరమును కట్టుటకు ఆజ్ఞ ఇచ్చాడు అన్నారు. కాబట్టి రాజువైన తమకు అనుకూలమైతే బబులోను పట్టణమందున్న రాజుయొక్క ఖజానాలో వెదకించి, దేవుని మందిరమును యెరూషలేములో కట్టుటకు రాజైన కోరెషు నిర్ణయము చేసెనో లేదో అది తెలిసికొని, రాజువైన తమరు ఆజ్ఞ ఇచ్చి యీ సంగతిని గూర్చి తమ చిత్తము తెలియజేయ గోరుచున్నాము అని వ్రాసిరి. కాని మందిరపు పని నాల్గవ అధ్యాయములోవలె నిలుపు చేయబడలేదు.

**ఎజ్రా 6:1-5 వ. రాజైన కోరెషు నిర్ణయమును యూదా అధికారులకు వ్రాసి పంపిన ఉత్తరము :-** దర్యావేషు ముందున్న రాజులవలె అనాలోచనగా మందిర పని ఆపించలేదు. ఆజ్ఞ ఇచ్చి ఖజానాలోని దస్తావేజు కొట్టులో వెదికించాడు. ఇది మంచి అలవాటు. ఏదైనా తీర్మానించకముందు ఆలోచించి తీర్మానించుట మంచిది. అప్పుడు రాజైన దర్యావేషు ఆజ్ఞ ఇచ్చినందున బబులోనులో ఖజానాలోని దస్తావేజు కొట్టులో వెదకగా ఒక గ్రంథము దొరికెను. దానిలో రాజైన కోరెషు ఏలుబడిలో మొదటి సంవత్సరమందు దేవుని మందిరమును గూర్చి నిర్ణయించిన వ్రాయబడియున్న సంగతులు కనబడెను.

**1. బలులు అర్పింప తగిన స్థలముగా మందిరము కట్టింపవలెను :-** ఆత్మ సంబంధమైన మందిరములను కట్టుటకు దహనబలి అనగా సజీవ యాగముగా మన దేహములను సమర్పించుకొనుట అవసరము. మూడవ అధ్యాయములో బలుల అవసరతను వ్రాసితిని.

**2. దాని పునాదులు గట్టిగా వేయబడవలెను :-** నేర్పరియైన శిల్పకారి పౌలువలె గట్టి పునాదులు వేసిన యెడల మందిరము బహుకాలము వర్ధిల్లును. ఎఫె 2:20వ.లో క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపోస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు. అపోస్తలులును ప్రవక్తలును వేసిన పునాది వివరములు అపొస్తలులు ప్రవక్తలు వ్రాసిన రోమా పత్రిక మొదలు యూదా పత్రిక వరకు 21 పత్రికలలో చెప్పబడినవి. కనుక సంఘ నిర్మాణము పత్రికలలో వ్రాయబడిన ప్రకారము జరుగుట క్షేమము.

**3. దాని నిడివి అరువది మూరలును దాని వెడల్పు అరువది మూరలును ఉండవలెను:** నలుదిక్కుల దాని పొడవు 60 మూరలు. ఆరు మానవుని బలమును సూచించు సంఖ్య 6×10=60. కనుక పది అంతల మానవ బలముతో భూమి యొక్క నలుదిక్కులలో సువార్త ప్రకటన జరిగి ఆత్మలు సంపాదించబడి సార్వత్రికముగా దేవుని మందిర పనులు జరగాలి.

**4. మూడు వరుసలు గొప్ప రాళ్ల చేత ఒక వరుస క్రొత్త మ్రానుల చేత కట్టింపబడ వలెను :-** రాయి మట్టి యొక్క సముదాయమే. మానవుడు మట్టిచే నిర్మించబడినందున రాళ్ళు మానవులను సూచించును. గొప్ప రాళ్ళు లోకరీతిగా సమాజములో గొప్పవారైన మానవులను సూచించును. ఆత్మీయ రీతిగా వాక్యములో లోతైన అనుభవము, బలము గలవారిని సూచించును. మీరు సజీవమైన రాళ్లని 1 పేతు 2:5వ.లో చెప్పబడినది. 'యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్లవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు'; అలాగే మ్రానులు అనగా చెట్లు మానవులను సూచించును. 'రాజా, ఆ చెట్టు నిన్ను సూచించుచున్నది' దాని 4:22వ. క్రొత్త మ్రానులు నూతనముగా సువార్త విని క్రీస్తును రక్షకునిగా విశ్వాసముంచిన వారిని సూచించును.

**5. దాని వ్యయమును రాజు యొక్క ఖజానాలోనుండి యియ్యవలెను :-** దేవుని మందిరము విషయమై అన్యుడైన ఒక రాజుకు ఎంత గొప్ప మనసు ఉన్నదో చూడండి. తరతరములుగా క్రైస్తవ విశ్వాసులుగా ఉన్న వారికి ఇటువంటి మనసు మరి ఎంతగా ఉండవలెనో ఆలోచించండి. కొద్దిమంది దేవుని మందిర పనికి ఇవ్వకపోగా విమర్శించి నిరుత్సాహపరచుదుము. ఇతరులు ఇచ్చిన దానిని దొంగలింతురు.

**6. యెరూషలేములో నున్న ఆలయములో నుండి నెబుకద్నెజరు బబులోనునకు తీసికొని వచ్చిన మందిర ఉపకరణములు :-** యెరూషలేములోని ఆలయములో నుండి నెబుకద్నెజరు బబులోనుకు తీసికొని వచ్చిన దేవుని మందిరము యొక్క వెండి, బంగారు ఉపకరణములు తిరిగి అప్పగింపబడి, యెరూషలేమునందున్న మందిరమునకు తేబడి, దేవుని మందిరములో

వాటి స్థలమందు పెట్టబడవలెనని రాజు యొక్క ఆజ్ఞలో చెప్పబడినది. ఆ దినములలో అన్యులైన రాజులకు దేవుని మందిర ఉపకరణముల విషయమై ఉన్న శ్రద్ధ ఈ దినములలో అనేకులకు లేదు. అంతేకాక ఈ దినములలో విశ్వాసులు మందిర ఉపకరణములను తమ స్వంత పనులకు వాడుకొను అలవాటు కూడా కలిగి ఉన్నారు.

**6-12వ. క్రీ.పూ. 520లో పాలించు దర్యావేషు రాజు యూదా అధికారులకు వ్రాసి పంపిన ఉత్తరము యొక్క వివరము :-**

**6-8వ. పని జరుగుట - పనికి సహాయ నిర్ణయము :-** దర్యావేషు రాజు ఆలోచించి మంచిగా తీర్మానించాడు. అధికారియైన తత్తెనై షెతర్బోజ్నయిలు యూదుల జోలికిపోకుండా దేవుని మందిరపు పని విషయమై వారి అధికారులను, పెద్దలను మందిరమునకు దాని స్థలమందు కట్టించనియ్యుడని ఆజ్ఞాపించాడు. మందిరమును కట్టించునట్లు రాజు యొక్క సొమ్ములోనుండి, అనగా వచ్చిన పన్నులోనుండి మందిర పని నిమిత్తము ఏ మాత్రమును తడవు చేయక వారి వ్యయమునకు కావలసినది అంతయు ఇయ్యవలెను అని తీర్మానించాడు.

**9-10వ. దేవునికి సువాసనగల బలులు అర్పించబడుట :-** ఆకాశమందలి దేవునికి దహనబలులు అర్పించుటకై కోడెలు, గొఱ్ఱ పొట్టేళ్లు, గొఱ్ఱ పిల్లలు, గోధుమలు, ఉప్పు ద్రాక్షారసము నూనె, యెరూషలేములో నున్న యాజకుల చేత ఆకాశమందలి దేవునికి సువాసనయైన అర్పణలను అర్పించబడాలని రాజు ఆజ్ఞాపించాడు. వారు చెప్పిన దానిని బట్టి ప్రతి దినమును తప్పకుండా వారికి కావలసినదంతయు ఇయ్యవలెనని రాజు ఆజ్ఞాపించాడు. రాజును అతని కుమారులును జీవించునట్లు దేవునికి ప్రార్థనలు చేయబడుట అవసరమని దర్యావేషు రాజు గుర్తించాడు.

**11-12వ. రాజు ఆజ్ఞను భంగపరచుట :-** ఎవడైనను మందిర విషయమైన రాజు యొక్క ఈ ఆజ్ఞను భంగపరచకూడదని చెప్పాడు. భంగపరచిన యెడల వాని యింటి వెన్నుగాడి ఊడ దీయబడి నిలువ నెత్తబడి దానిమీద వాడు ఉరితీయింపబడునని, వాని యిల్లు పెంటరాశి చేయబడునని చెప్పాడు. ఏ రాజులే గాని యే జనులేగాని యీ ఆజ్ఞను భంగపరచి యెరూషలేములో నున్న దేవుని మందిరమును నశింపజేయుటకై చెయ్యి చాపిన యెడల, తన నామమును అక్కడ ఉంచిన దేవుడు వారిని నశింపజేయును అని సెలవిచ్చాడు. దర్యావేషు మందిర పని అతి వేగముగా జరుగవలెనని ఆజ్ఞ ఇచ్చి తాకీదుగా వ్రాయించి పంపించెను. మందిర పనికి రాజు యొక్క సొమ్ములోనుండి తడవుచేయక ఇవ్వాలి, తప్పక ఇవ్వాలి. మందిర పని అతి వేగముగా జరగాలి అనునది రాజాజ్ఞ సారాంశము.

**13-14వ. పని జరిగిన విధము:-** అధికారులు రాజైన దర్యావేషు ఇచ్చిన ఆజ్ఞ చొప్పున మందిర పని అతి వేగముగా గాక, వేగముగా పని జరిపించిరి. యూదుల పెద్దలు కట్టించుచు, ప్రవక్తయైన హగ్గయియు ఇద్దో కుమారుడైన జెకర్యాయు హెచ్చరించు చున్నందున పని బాగుగా జరిపిరి. ఈ ప్రకారము ఇశ్రాయేలీయుల దేవుని ఆజ్ఞ ననుసరించి వారు కట్టించుచు, కోరెషు దర్యావేషు అర్తహషస్త అను పారసీక దేశపు రాజుల ఆజ్ఞ చొప్పున క్రీ.పూ. 536లో ప్రారంభించబడిన ఆ పని క్రీ.పూ. 515 వరకు 21 సంవత్సరములు చేయబడెను.

**15-16వ. పని సమాప్తి - ప్రతిష్ట :-** రాజైన దర్యావేషు ఏలుబడియందు ఆరవ సంవత్సరము క్రీ.పూ. 515 అదారు నెల మూడవ నాటికి మందిరము సమాప్తి చేయబడెను. జెకర్యా 4:9వ.లో జెరుబ్బాబెలు చేతులు ఈ మందిరపు పునాదివేసి యున్నవి. అతని చేతులు ముగించును అని వ్రాయబడినను, జెరుబ్బాబెలు దేవుని మందిర ప్రతిష్ఠత తాను చేయక ఇశ్రాయేలీయులు, యాజకులు, లేవీయులు, చెరలోనుండి విడుదల నొందిన తక్కినవారిచే దేవుని మందిర ప్రతిష్ఠత చేయించాడు. ఇది మనందరికి ఎంతో మాదిరి.

**17-22వ. మందిరంను ప్రతిష్ఠించిన వివరము :-**

17వ. దేవుని మందిరమును ప్రతిష్ఠించినప్పుడు నూరు ఎడ్లను రెండు వందల పొట్టేళ్లను నాలుగు వందల గొఱ్ఱెపిల్లలను ఇశ్రాయేలీయులకందరికిని పాపపరిహారార్ధ బలిగా ఇశ్రాయేలీయుల గోత్రముల లెక్కచొప్పున పండ్రెండు మేకపోతులను అర్పించిరి. దీని భావము సంఘములో నిత్యము పాపపరిహార కార్యములు అనగా రక్షించబడుట అను కార్యము నిత్యము జరుగుచుండాలి.

18వ.లో వారు యెరూషలేములోనున్న దేవుని సేవ జరిపించుటకై మోషే గ్రంథమందు వ్రాసిన దానిని బట్టి తరగతుల చొప్పున యాజకులను వరుసల చొప్పున లేవీయులను నిర్ణయించిరి. లేవీయులను నిర్ణయించుట సంఘములలో సువార్త ప్రకటించు పనివారు నిర్ణయించబడుటను సూచించును.

19వ. చెరలోనుండి విడుదలనొందినవారు మొదటి నెల పదునాలుగవ దినమున పస్కా పండుగ ఆచరించిరి. పస్కా పండుగ ఆచరణ ప్రభురాత్రి భోజన ఆచరణను సూచించును.

20వ. యాజకులను లేవీయులను తమ్మును తాము పవిత్రపరచుకొని పవిత్రులైన తరువాత, చెరలో నుండి విడుదల నొందిన వారందరికొరకును తమ బంధువులైన యాజకుల కొరకును, తమ కొరకును పస్కా పశువును వధించిరి. బంధువుల కొరకును పస్కా పశువును వధించుట బంధువులను రక్షించబడు అనుభవములోనికి నడిపించుటయే.


21వ. చెరలో నుండి విడుదలనొంది తిరిగి వచ్చిన ఇశ్రాయేలీయులును, దేవుడైన యెహోవాను

ఆశ్రయించుటకై దేశమందుండు అన్యజనులలో అపవిత్రతనుండి తమ్మును తాము ప్రత్యేకించుకొనిన వారందరు వచ్చి పులియని రొట్టెల పండుగను ఏడు దినములు ఆనందముతో ఆచరించిరి. ఏడు దినములు ఆనందముతో ఆచరించుట సంపూర్ణ కాలము ఆచరించుటను సూచించును. అన్యజనుల అపవిత్రత నుండి తమ్మును తాము సంపూర్ణ కాలము ప్రత్యేకించుకొనుట 2 కొరిం 6:14-16 వచనముల ప్రకారము జీవిత కాలమంత అన్యులతో జోడుగా ఉండకుండుటను సూచించును. '14 మీరు అవిశ్వాసులతో జోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము ? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు ?

15 క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము ? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది?
16 దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక ? మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము; దేవుడీలాగు సెలవిచ్చుచున్నాడు. నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనైయుందును వారు నా ప్రజలై యుందురు.'

కనుక రక్షించబడిన వారు ఏ విషయములోనైనా వివాహమాడు విషయములో కాని అన్యులతో కలసిన యెడల దేవుని ఆలయమైన నీ ఇంటి లోనికి విగ్రహము, దుర్నీతి, చీకటి, బెలియాలు అనగా సాతాను వచ్చి నీతో సంబంధము కలిగి యుండరాదు. రక్షించబడిన వారు అన్యులను రక్షణ అనుభవములోనికి నడిపించుటకు మాత్రమే వారితో కలపవచ్చును కాని మిగిలిన ఏ విషయములోనైనను జోడుగా ఉండరాదు.

22వ. దేవుని మందిరపు పని విషయమై ఇశ్రాయేలీయుల చేతులను బలపరచుటకు యెహోవా రాజుల హృదయమును ఇశ్రాయేలీయుల వైపు త్రిప్పి వారిని సంతోషింపజేశాడు. దీని భావము దేవుని సంఘములో పని జరుగుటకు దేవుడు ఎటువంటి అధికారులు మనసునైనా త్రిప్పగలడని మనకు నేర్పించుచున్నాడు. అటు తరువాత క్రీ.పూ. 515 నుండి క్రీ.పూ. 458 వరకు 58 సంవత్సరముల వరకు మందిరము విషయమై ఏ సంగతులు చెప్పబడలేదు.



# ఎజ్రా గ్రంథము 7 అధ్యాయము (5+5+6+4+3+3+2=28 వచనములు)

**అంశము : ఎజ్రా మందిరమును అలంకరించుటకు పనివారితో యెరూషలేమునకు వచ్చుట.** క్రీ.పూ. 515లో మందిర నిర్మాణము ముగించబడినది. కాని క్రీ.పూ. 458 వరకు అనగా మందిరము కట్టబడిన తరువాత 58 సంవత్సరముల వరకు మందిర కార్యక్రమములను జరిగించుటకు అవసరమైన పని వారిని నిర్ణయించుట జరుగలేదు. ఈ మధ్య కాలములోనే క్రీ.పూ. 485-465 మధ్య అహష్వేరోషు రాజుగా ఉండెను. ఈ కాలములో ఎస్తేరు గ్రంథ కాల చరిత్ర జరిగినది.

7వ అధ్యాయములో క్రీ.పూ. 458లో పారసీక దేశపు రాజైన అర్తహషస్త యొక్క యేలుబడిలో ఎజ్రా మొదటి నెల మొదటి దినమందు బబులోను దేశము నుండి బయలుదేరి, తన దేవుని కరుణా హస్తము తనకు తోడుగా నున్నందున నాలుగు మాసములు ప్రయాణము చేసి అయిదవ నెల మొదటి దినమున యెరూషలేమునకు చేరెను. ఎజ్రా యెహోవా ధర్మశాస్త్రమును పరిశోధించి దాని చొప్పున నడుచుకొనుటకును, ఇశ్రాయేలీయులకు దాని కట్టడలను విధులను నేర్పుటకును దృఢ నిశ్చయము చేసికొనెను.

మందిరమును అలంకరించుట అనగా మందిర కార్యక్రమములకు అవసరమైన పనివారిని నిర్ణయించుటయే. ఎజ్రా 7:6-7వ.లో ఈ ఎజ్రా యెహోవా అనుగ్రహించిన మోషేయొక్క ధర్మశాస్త్రమందు ప్రవీణతగల శాస్త్రి మరియు అతని దేవుడైన యెహోవా హస్తము అతనికి తోడుగా ఉన్నందున అతడు ఏ మనవి చేసినను రాజు అనుగ్రహించును. రాజైన అర్తహషస్త ఏలుబడియందు ఏడవ సంవత్సరమున ఇశ్రాయేలీయులు కొందరును యాజకులు కొందరును లేవీయులును, గాయకులును, ద్వారపాలకులును, నెతీనీయులును బయలుదేరి యెరూషలేము పట్టణమునకు వచ్చిరి. 7:27వ వచనములో ప్రధానులును వచ్చిరి. మందిరమును అలంకరించుటకు రాజుకు దేవుడు బుద్ధి పుట్టించాడు.

### 1-5వ. ఎజ్రా వ్యక్తిగతము :-

1-5వ. ఎజ్రా శెరాయా కుమారుడై యుండెను. శెరాయా అజర్యా కుమారుడు, అజర్యా హిల్కీయా కుమారుడు, వీరు ప్రధాన యాజకుడైన అహరోను కుమారుడగు ఎలియాజరు వంశీకులు. ఎజ్రా అనగా సహాయకుడు అని అర్థము. శెరాయా అనగా యెహోవా మానక పనిచేయువాడు అని అర్థము. అజర్యా అనగా యెహోవా సహాయకుడు అని అర్థము. యెహోవా మానక పనిచేయువాడు సహాయకుడు కాని మందిరములో కార్యములు జరిగించు పనివారికి 58 సంవత్సరములు ప్రజలు నియమించక పోయినను మౌనముగా ఉండెను.

ఇది దేవుని దీర్ఘ శాంతమునకు ఉదాహరణ. యెహోవా మందిరమును అలంకరించుటకు 58 సంవత్సరముల తరువాత ఎజ్రా వచ్చాడు.

**6-10వ. ఎజ్రా యెరూషలేమునకు దృఢ నిశ్చయముతో వచ్చుట :-**

6-7వ. ఈ ఎజ్రా ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా అనుగ్రహించిన మోషే యొక్క ధర్మశాస్త్రమందు ప్రవీణతగల శాస్త్రి. మరియు అతని దేవుడైన యెహోవా హస్తము అతనికి తోడుగా ఉన్నందున అతడు ఏ మనవి చేసినను రాజు అనుగ్రహించును. ఎజ్రా వలె ధర్మశాస్త్రమందు ప్రవీణతగల వారు దేవుని హస్తము తోడుగా ఉన్నవారు ఈ దినములలో సంఘములందు ఎంతో అవసరముగా ఉన్నారు. ఎజ్రా తనతోపాటే కొందరు యాజకులను, కొందరు లేవీయులను, ద్వారపాలకులను, గాయకులను, నెతినీయులను, యెరూషలేము పట్టణమునకు తీసికొని వచ్చాడు.

**ఎజ్రాకు దేవుని కరుణా హస్తము తోడుగా ఉన్న 7 వచనములు**

1) 7:6. ఈ ఎజ్రాకు అతని దేవుడైన యెహోవా హస్తము అతనికి తోడుగా ఉన్నందున అతడు ఏ మనవి చేసినను రాజు అనుగ్రహించును.

2) 7:9. అతడు బబులోను దేశమునుండి బయలుదేరి, తన దేవుని కరుణా హస్తము తనకు తోడుగానున్నందున యెరూషలేమునకు చేరెను.

3) 7:28. నా దేవుడైన యెహోవా హస్తము నాకు తోడుగా ఉన్నందున నేను బలపరచబడి, నాతో కూడ వచ్చుటకు ఇశ్రాయేలీయుల ప్రధానులను సమకూర్చితిని.

4) 8:18. మా దేవుని కరుణా హస్తము మాకు తోడుగా ఉన్నందున వారు ప్రజ్ఞావంతుడైన ఒకనిని షేరేబ్యాను అతని కుమారులను, సహోదరులను, పదునెనిమిది మందిని తోడుకొని వచ్చిరి.

5) 8:22. మేలు కలుగజేయుటకై ఆయనను ఆశ్రయించు వారికందరికిని మా దేవుని హస్తము తోడుగా ఉండును.

6) 8:31. మేము మొదటి నెల పండ్రెండవ దినమందు యెరూషలేమునకు వచ్చుటకై అహవా నది నుండి బయలుదేరగా, మా దేవుని హస్తము తోడుగా నుండి, శత్రువులు మార్గమందు పొంచియున్న వారి చేతిలో నుండి మమ్మును తప్పించెను.

8:10వ. ఎజ్రా యెహోవా ధర్మశాస్త్రమును పరిశోధించి దాని చొప్పున నడచుకొనుటకు, ఇశ్రాయేలీయులకు దాని కట్టడలను విధులను నేర్పుటకు దృఢనిశ్చయము చేసికొని, రాజు ఏలుబడియందు ఏడవ సంవత్సరము అయిదవ మాసమున యెరూషలేమునకు వచ్చాడు. నేటి ఆత్మీయ మందిరములు అనగా సంఘములలో లేఖనములయందు ప్రవీణతగల వారి ద్వారా ఎడతెగక నేర్పించు బోధ కూడికలు ఉండాలి. అపో. 2:41-42వ. లో అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి, ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి. వీరు అపోస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి.

**11-20వ. రాజు మందిర అలంకరణను గూర్చి ఎజ్రాకిచ్చిన తాకీదు :-**

11-13వ. యెహోవా వాక్యమందు ప్రవీణతగల శాస్త్రి అని, ఆయన ఆజ్ఞలు, ఆయన విధించిన కట్టడలను అనుసరించు యాజకుడని అర్తహషస్త రాజు యిచ్చిన తాకీదులో వ్రాశాడు. ఎజ్రా చేతిలో ఎల్లప్పుడు ధర్మశాస్త్ర గ్రంథము ఉండునని ధర్మశాస్త్రమును బట్టి యెరూషలేమును గూర్చి విమర్శ చేయుటకును రాజుచేతను మంత్రుల చేతను నియమించ బడ్డాడు. రాజు అతని యేడుగురు మంత్రుల సభ సర్వాధికారములుగల పెద్ద సభ.

14-16వ. రాజ్యమందుండు ఇశ్రాయేలీయులలో, యాజకులలో, లేవీయులలోను యెరూషలేము పట్టణమునకు వెళ్లుటకు మన:పూర్వకముగా ఇష్టపడువారెవరో వారందరు ఎజ్రాతో కూడ వెళ్లవచ్చును. మరియు మూడు రకములైన అర్పణాలు ఇక్కడ చెప్పబడ్డాయి. 1) దేవునికి రాజు అతని యొక్క మంత్రులును స్వేచ్ఛగా అర్పించిన వెండి బంగారములను, 2) బబులోను ప్రదేశమందంతట ఎజ్రాకు దొరకు వెండి బంగారమంతయును 3) జనులును, యాజకులును యెరూషలేములో నున్న తమ దేవుని మందిరమునకు స్వేచ్ఛగా అర్పించు వస్తువులను ఎజ్రా తీసికొని పోవలెనని రాజు ఆజ్ఞ ఇచ్చాడు.

17-18వ. తడవుచేయక ఆ ద్రవ్యముచేత ఎడ్లను, పొట్టేళ్లను, గొఱ్ఱెపిల్లలను, వాటితో కూడా ఉండవలసిన భోజనార్పణలను పానార్పణలనుకొని, దేవుని మందిరపు బలిపీఠము మీద వాటిని అర్పించి మిగిలిన వెండి, బంగారములతో మీ దేవుని చిత్తానుసారముగా మీకు యుక్తమని తోచిన దానిని చేయవచ్చునని చెప్పాడు.

19-20వ. మరియు దేవుని మందిరపు సేవకొరకు ఇయ్యబడిన ఉపకరణములను యెరూషలేములోని దేవుని యెదుట ఆరాధన కొరకు అప్పగింపవలెనని సెలవిచ్చాడు. దేవుని మందిర విషయములో ఏదైనను కావలసిన యెడల అది రాజు యొక్క ఖజానాలో నుండి దానముగా నీకియ్యబడునని సెలవిచ్చాడు.

**21-23వ. రాజు మందిర అలంకరణను గూర్చి నది అవతల అధికారులకిచ్చిన ఆజ్ఞ:-** మరియు రాజునైన అర్తహషస్త అను నేనే నదియవతలనున్న ఖజానాదారులైన మీకు ఇచ్చు ఆజ్ఞయేదనగా - ఆజ్ఞలోని నాలుగు భాగములు గమనించండి.

1) ఆకాశమందలి దేవుని ధర్మశాస్త్రములో శాస్త్రియు యాజకుడునైన ఎజ్రా మిమ్మును ఏదైన అడిగిన యెడల వెంటనే మీరు దాని చేయవలెను.
2) వెయ్యి తూముల గోధుమలు రెండువందల మణుగుల వెండి మూడు వందల తూముల ద్రాక్షారసము మూడు వందల తూముల నూనె లెక్కలేకుండా ఉప్పును ఇయ్యవలెను.
3) ఆకాశమందలి దేవునిచేత ఏది నిర్ణయమాయెనో దాని ఆకాశమందలి దేవుని మందిరమునకు జాగ్రత్తగా చేయింపవలసినది.
4) రాజు యొక్క రాజ్యము మీదికి అతని కుమారుల మీదికిని కోపమెందుకు రావలెను? దేవుని పనికి ఇవ్వవలసినది ఇవ్వనియెడల దేవుని కోపము వచ్చునని అనేకులు విశ్వాసులైన వారు ఈ అన్యుడైన రాజువలె తలంచరు. దేవుని మందిర పరిచర్యకు అవసరమైన వాటిని వెంటనే చేయవలెనని నేర్చుకొందము.

**24-26వ. రాజు మందిర అలంకరణను గూర్చి ఎజ్రాకిచ్చిన మరికొన్ని సలహాలు :-**

మరియు యాజకులును లేవీయులును, గాయకులును ద్వారపాలకులు, నెతీనీయులును, దేవుని మందిరపు సేవకులునైన వారందరిని గూర్చి మేము మీకు నిర్ణయించినదేమనగా, వారికి శిస్తుగాని, సుంకముగాని, పన్నుగాని వేయుట కట్టడపు న్యాయము కాదని తెలిసికొనుడి. మరియు ఎజ్రా, నది యవతల నున్న జనులకు తీర్పు తీర్చుటకై నీ దేవుడు నీకు దయచేసిన జ్ఞానము చొప్పున నీవు నీ దేవుని యొక్క ధర్మశాస్త్ర విధులను తెలిసికొనిన వారిలో కొందరిని అధికారులుగాను, న్యాయాధిపతులుగాను ఉంచవలెను. రాజు అన్యుడైనను ధర్మశాస్త్ర విషయములో తెలియని వారెవరో వారికి నేర్పవలెనని చెప్పాడు. దేవుని ధర్మశాస్త్రముగాని, రాజు యొక్క చట్టముగాని, గైకొనని వాడెవడో త్వరగా విచారణ చేసి, మరణ శిక్షయైన, స్వదేశ త్యాగమైన, ఆస్తి జప్తియైన, ఖైదునైన వానికి విధింపవలెనని చెప్పుట దేవునియందు రాజు యొక్క భక్తిని సూచించుచున్నది.

**27-28వ.** ముగింపులో యెరూషలేములో నుండు మందిరమును అలంకరించుటకు రాజునకు బుద్ధి పుట్టించినందున ఎజ్రా యెహోవాకు స్తోత్రము చెప్పాడు. దేవుడైన యెహోవా హస్తము తోడుగా ఉన్నందున బలపరచబడి, యెరూషలేముకు తనతో కూడ వచ్చుటకు ఇశ్రాయేలీయుల ప్రధానులను సమకూర్చగలిగాడు.

# ఎజ్రా గ్రంథము 8 అధ్యాయము (3+11+6+3+7+6=36 వచనములు)

**అంశము :- 1756 మంది పనివారితో యెరూషలేము వెళ్ళుట - పరికరములు అప్పగించుట.**

**1-3వ. పెద్దల పేర్లు చెప్పబడుట : బబులోనునుండి ఎజ్రాతో కూడి వచ్చిన యింటి పెద్దల వంశావళి :-** ఫీనెహాసు వంశములో గెర్షోము, ఈతామారు వంశములో దానియేలు, దావీదు వంశములో హట్టూషు, షెకన్యా పరోషుల వంశములలో జెకర్యా మరియు వంశావళిలో లెక్కించబడిన నూట ఏబది మంది పురుషులు వారితో వెళ్ళిరి.

**4-14వ. సమాజములో ఉన్నవారి లెక్క :-** 12 వంశములు బహుశా 12 గోత్రములలో ప్రతి గోత్రమునుండి ఎజ్రాతో వచ్చిన అందరు 1496 మంది.

**15-20వ. లేవీయులు, నెతనీయుల లెక్క :-** ఆహవా వైపునకు పారు నది యొద్దకు అందరిని సమకూర్చి మూడు దినములు గుడారములలో ఉండిరి. జనులను, యాజకులను తనిఖీ చూడగా లేవీయుడొకడును కనబడలేదు. కనుక పెద్దలను కాసిప్యా అను స్థలమందుండు అధికారియైన ఇద్దో యొద్దకు పంపాడు. పెద్దలు మహలీ కుమారులలో ఒకడు ప్రజ్ఞావంతుడైన షేరేబ్యా అను ఒకని, అతని కుమారులను, సహోదరులను, పదునెనిమిది మందిని తోడుకొని వచ్చిరి. అలాగే హషబ్యాను అతనితో కూడా మెరారీయుడగు యెషయాను అతని బంధువులును వారి కుమారులునైన యిరువది మందిని వారు తోడుకొని వచ్చిరి. మరియు లేవీయులు చేయవలసిన సేవలో తోడ్పడుటకై దావీదు అధిపతులు నిర్ణయించిన నెతీనియులలో రెండు వందల ఇరువదిమంది వచ్చిరి. సేవకు ప్రత్యేకించబడిన లేవీయుల అవసరత గుర్తించాలి.

**21-23వ. ప్రయాణము కొరకు ప్రార్థన :-** మార్గమందున్న శత్రువులనుండి కాపాడునట్లు కాల్బలమును రౌతులును రాజునొద్ద కావలెని మనవి చేయుటకు ఎజ్రా సిగ్గుగా తలంచెను. ప్రయాణము కొరకు అందరు ఉపవాసముండి దేవుని వేడుకొనగా దేవుడు అంగీకరించి కాల్బలము యెరూషలేముకు తీసుకొని వచ్చాడు. దేవుని కాపుదలయే ఉన్నతమైనది.

**24-30వ. వస్తువులు యాజకులకు అప్పగించుట :-** యాజకులలో ప్రధానులైన పండ్రెండు మందిని, ఏర్పరచి దేవుని మందిరమును ప్రతిష్ఠించుట విషయములో ఇశ్రాయేలీయులందరును రాజును అతని మంత్రులు, అధిపతులు అక్కడ ఉన్న ప్రతిష్ఠించిన వెండి, బంగారములను ఉపకరణములను తూచి వారికి అప్పగించాడు. కాబట్టి మీరు యెరూషలేములో వాటిని తూచి అప్పగించువరకు వాటిని భద్రముగా ఉంచుడని ఎజ్రా వారితో చెప్పాడు. కాబట్టి యాజకులును, లేవీయులును వాటి యెత్తు ఎంతో తెలిసికొని, యెరూషలేములోనున్న మన దేవుని మందిరమునకు కొనిపోవుటకై ఆ వెండి, బంగారములను పాత్రలను తీసికొనిరి.

1 కొరిం 16:3వ.లో పౌలు–నేను వచ్చినపుడు మీరెవరిని యోగ్యులనియెంచి పత్రికలిత్తురో, వారిచేత మీ ఉపకార ద్రవ్యమును యెరూషలేమునకు పంపుదును అన్నాడు. అలాగే నమ్మకమైన 12 మందిని ఏర్పరచి ఎజ్రా వస్తువులన్ని వారి చేతికి అప్పగించాడు.

**31–36వ. ప్రయాణ ముగింపు :–** వారు మొదటి నెల పండ్రెండవ దినమందు యెరూషలేమునకు వచ్చుటకై అహవా నది నుండి బయలుదేరి, మా దేవుని హస్తము మాకు తోడుగా నుండి, శత్రువుల చేతిలో నుండి మమ్మును తప్పించినందున యెరూషలేమునకు మేము వచ్చి మూడు దినములు అక్కడ బసచేసితిమి. నాలుగవ దినమున మా దేవుని మందిరమందున్న నమ్మకమగు గృహనిర్వాహకులగు యాజకులకు వాటిని అప్పగించగా బంగారము, వెండి, పాత్రలను, ఎత్తు చొప్పునను సంఖ్య చొప్పునను అన్నిటిని సరిచూచిన తరువాత వాటి యెత్తు ఎంతైనది లెక్కలలో వ్రాసిరి. 1 కొరిం 4:2వ. గృహనిర్వాహకులలో ప్రతివాడును నమ్మకమైనవాడై యుండుట అవశ్యము. యెరికో పట్టణములో దేవుని మందిరమునకు చేర్చవలసిన వస్తువులను దొంగలించిన ఆకాను వంటి వారు అనేకులు ఉన్నారు. (యెహో 7:11–21వ.) దేవుని మందిర వస్తువులను భద్రముగా కాపాడువారు నేటి సంఘములలో అవసరము.

**35–36వ.** మరియు చెరలోనికి కొనిపోబడినవారికి పుట్టి చెరనుండి విడుదలనొంది తిరిగి వచ్చినవారు అందరికొరకు దేవునికి దహన బలులను, పాపపరిహారార్థ బలులను అర్పించిరి. తరువాత వీరు జనులకును దేవుని మందిరపు పనికిని సహాయము చేసిరి. ప్రజలు ఈలాగు జరుగుట చూచి దేవుని ఆరాధించుటలో బలపరచబడిరి.

## బైబిలులో పలువురు ప్రార్థించిన విధము

1) నెహె 9:5 అప్పుడు లేవీయులైనవారు నిలువబడి, నిరంతరము మీకు దేవుడైయున్న యెహోవాను స్తుతించుడని చెప్పి ఈలాగు స్తోత్రము చేసిరి.
2) నెహె 8:6 ఎజ్రా మహాదేవుడైన యెహోవాను స్తుతింపగా జనులందరు తమ చేతులెత్తి ఆమేన్ ఆమేన్ అని పలుకుచు, నేలకు ముఖములు వంచుకొని యెహోవాకు నమస్కరించిరి.
3) ఎజ్రా 9:5 నేను లేచి, నా వస్త్రమును పై దుప్పటిని చింపుకొని మోకాళ్ల మీద పడి, నా దేవుడైన యెహోవాను తట్టు చేతులెత్తి నా దేవా నా దేవా,... (ప్రార్థించితిని).
4) ఎజ్రా 10:1 ఎజ్రా యేడ్చుచు దేవుని మందిరము ఎదుట... సాష్టాంగపడుచు, పాపమును ఒప్పుకొని ప్రార్థన చేసెను.
5) 2 సమూ 7:18 దావీదురాజు యెహోవా సన్నిధిని కూర్చుండి ఈలాగున మనవి చేసెను.

# ఎజ్రా గ్రంథము 9 అధ్యాయము (4+6+6=16 వచనములు)

**అంశము: పరిశుద్ధత కొరకైన ప్రార్థన**

**1-4వ. పరిశుద్ధులుగా ఉండవలసిన యూదావారు దేశపు జనులతో కలిసిపోవుట:-**

1-2వ. యూదా పెద్దలు ఎజ్రా యొద్దకు వచ్చి ఇశ్రాయేలీయుల పెద్దలు, ముఖ్యముగా అధికారులు, యాజకులు, లేవీయులు, తమ్మును తాము ప్రత్యేకపరచుకొనక కనానీయులు, హిత్తీయులు, పెరిజ్జీయులు, యెబూసీయులు, అమ్మోనీయులు, మోయాబీయులు, ఐగుప్తీయులు, అమోరీయులు అను దేశపు జనములలో కలిసిపోయి (మీరు అవిశ్వాసులతో జోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతికి ఏమి సాంగత్యము ? వెలుగునకు చీకటితో ఏమిపొత్తు? క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది? దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక ? (2 కొరిం 6:14-16వ)

వారు చేయు అసహ్యమైన కార్యములను తామే చేయుచున్నారని చెప్పిరి. యూదావారు అన్యుల కుమార్తెలను పెండ్లిచేసికొనుచు, తమ కుమార్తెకు అన్యుల కుమారులను తీసికొనుచు, పరిశుద్ధ సంతతిగా ఉండవలసిన తాము ఆ దేశపు జనులతో కలిసికొనినవారైనని చెప్పిరి.

3-4వ. ఎజ్రా ఈ సంగతి విని తన వస్త్రమును పై దుప్పటిని చింపుకొని, తల వెండ్రుకలను, గడ్డపు వెండ్రుకలను పెరికి వేసికొని విభ్రాంతిపడి సాయంత్రపు అర్పణ వేళవరకు కూర్చుండెను. చెరపట్టబడినవారి అపరాధమును చూచి, ఇశ్రాయేలీయుల దేవుని మాటకు భయపడిన వారందరును ఎజ్రా యొద్దకు కూడి వచ్చిరి. నేటి కాల విశ్వాసులలో దేవునికి భయపడువారున్నారు. భయపడని వారున్నారు. నీవు భయపడుచున్నావా ? వివాహములలో తప్పితివా, పరిశుద్ధ సంతతిగా ఉన్నావా ?

**5-10వ. ఎజ్రా అపరాధముల విషయము ఆలోచించి ప్రార్థన చేయుట :-**

5-6వ. సాయంత్రపు అర్పణ వేళను శ్రమ తీరగా నేను లేచి, నా వస్త్రమును పై దుప్పటిని చింపుకొని మోకాళ్ల మీద పడి, నా దేవుడైన యెహోవా తట్టు చేతులెత్తి నా దేవా నా దేవా, నా ముఖము నీ వైపు ఎత్తికొనుటకు సిగ్గుపడి ఖిన్నుడనైయున్నాను. మా దోషములు మా తలలకు పైగా హెచ్చియున్నవి, మా అపరాధము ఆకాశమంత యెత్తుగా పెరిగియున్నది.

7-8వ. మా పితరుల దినములు మొదలుకొని నేటివరకు మేము మా దోషములను బట్టి మేమును మా రాజులును అన్య రాజుల వశమునకు ఖడ్గమునకు చెరకు దోపునకు అప్పగింపబడుట చేత మిగుల సిగ్గునొందినవారమైతిమి. అయితే ఇప్పుడు మా దేవుడు మా నేత్రములకు వెలుగిచ్చి, మా దాస్యములో మమ్మును కొంచెము తెప్పరిల్ల జేయునట్లుగాను,

మాలో ఒక శేషము ఉండనిచ్చినట్లుగాను, తన పరిశుద్ధ స్థలమందు మమ్మును స్థిరపరచి మా దేవుడైన యెహోవా కొంతమట్టుకు మా యెడల దయ చూపియున్నారు.

9-10వ. నిజముగా మేము దాసలమైతిమి; అయితే నీవు మా దాస్యములో మమ్మును విడువక, మాకు దయ కనుపరచి, మేము తెప్పరిల్లునట్లుగా మా దేవుని మందిరమును నిలిపి, దాని పాడైన స్థలములను తిరిగి బాగుచేయుటకును, యూదాదేశమందును యెరూషలేము పట్టణమందును మాకు ఒక ఆశ్రయము నిచ్చుటకు కృప చూపించితివి. మా దేవా, యింత కృపనొందిన తరువాత మేమేమి చెప్పగలము ? నిజముగా ప్రవక్తలైన నీ దాసుల ద్వారా నీవిచ్చిన ఆజ్ఞలను మేము అనుసరింపకపోతిమి.

**11-16వ. దేవుని సన్నిధిని అపరాధమును గుర్తించి ప్రార్థించుట :-**

11-12వ. మీరు స్వతంత్రించుకొనబోవు దేశము దాని నివాసులు అపవిత్రత చేతను వారు చేయు అసహ్యమైన వాటిచేత అపవిత్రమైన అసహ్యమైన వాటిచేత ఆ దేశము నలుదిక్కుల నిండినదాయెను. కాబట్టి మీరు మీ కుమార్తెలను వారి కుమారులకియ్యకుడి. వారి కుమార్తెలను మీ కుమారులకొరకు పుచ్చుకొనకుడి. మరియు వారికి క్షేమభాగ్యములు కలుగవలెనని మీరు ఎన్నటికిని కోరకుండిన యెడల, మీరు బలముగానుండి, ఆ దేశము యొక్క సుఖమును అనుభవించి, మీ పిల్లలకు నిత్య స్వాస్థ్యముగా దానినప్పగించెదరని చెప్పిరి.

13-14వ. అయితే మా దుష్క్రియలను బట్టి మా గొప్ప అపరాధములను బట్టి ఈ శ్రమలన్నియు మామీదికి కొచ్చిన తరువాత, మా దేవుడవైన నీవు మా దోషములకు రావలసిన శిక్షలో కొంచెమే మా మీద ఉంచి, మాకు ఈ విధముగా విడుదల కలుగజేయగా మేము నీ ఆజ్ఞలను మీరి ఈ అసహ్య కార్యములను జరిగించిన జనులతో సంబంధములు చేసికొనిన యెడల, మేము నాశనమగు వరకు శేషమైనను లేకుండునట్లును, తప్పించుకొనుటకు సాధనమైనను లేకుండునట్టును, నీవు కోపపడుదువు గదా.

15వ. యెహోవా దేవా, నీవు నీతిమంతుడవైయున్నావు. అందువలననే నేటి దినమున ఉన్నట్లుగా మేము శేషించి నిలుచుచున్నాము. చిత్తగించుము; మేము నీ సన్నిధిని అపరాదులము గనుక నీ సన్నిధిని నిలుచుటకు అర్హులము కామని ప్రార్థన చేసితిని. ప్రజల పరిశుద్ధత విషయమై ఎజ్రావలె మనము ఆలోచించాలి. 2 కొరిం 11:28వ.లో ఇవియును గాక సంఘములన్నిటిని గూర్చిన చింతయు కలదు. ఈ భారము దినదినమును నాకు కలుగుచున్నదని పౌలు చెప్పుచున్నాడు. సంఘములన్నిటిని గూర్చిన చింత, బాధ కల పౌలు ఎజ్రాల వంటివారు నేటి సంఘములలో అవసరముగా ఉన్నారు.

# ఎజ్రా 10వ అధ్యాయము

## (4+6+1+3+3+7+20=44 వచనములు)

**అంశము :- అన్యస్త్రీలను పెండ్లి చేసికొనినవారందరు దిద్దబడి పరితపించి పాపములు ఒప్పుకొని సరిచేసికొనుట.**

**1-4వ. ఎజ్రా ప్రార్థన : షెకన్యా వాక్యానుసారమైన సలహా ఇచ్చుట :-** ఎజ్రా యేడ్చుచు దేవుని మందిరము ఎదుట సాష్టాంగపడుచు, పాపమును ఒప్పుకొని ప్రార్థన చేసెను. ఇశ్రాయేలీయులలో పురుషులు స్త్రీలు చిన్నవారు మిక్కిలి గొప్ప సమూహముగా అతని యొద్దకు కూడివచ్చి బహుగా ఏడ్వగా షెకన్యా ప్రజల పక్షమున ఎజ్రాతో ఇట్లనెను. మేము దేశమందుండు అన్యజనములలోని స్త్రీలను పెండ్లి చేసికొని మా దేవుని దృష్టికి పాపము చేసితిమి – మొదటిగా పాపమును గుర్తించుట అవసరము. అయితే ఈ విషయములో ఇశ్రాయేలీయులు తమ నడవడి దిద్దుకొని యీ పని ధర్మశాస్త్రానుసారముగా దైవాజ్ఞకు భయపడు నీ యోచననుబట్టి, ఈ భార్యలను వారికి పుట్టిన వారిని వెలివేయించెదమని మన దేవునితో నిబంధన చేసికొనెదము – రెండవదిగా దిద్దుబాటు జరగాలి. ప్రజలు లెమ్ము ఈ పని నీ యధీనములో నున్నది – మూడవదిగా ఈ పని నీ ఆధీనములో నున్నది కనుక నీవే చేయాలి. మేమును నీతో కూడ నుందుము అని చెప్పుటలో ప్రజలు ఈ కార్యమునకు అంగీకరించిరి. నీవు ధైర్యము తెచ్చుకొని దీని జరిగించుమని చెప్పెను – నాల్గవదిగా ఎజ్రా వంటి నాయకులను ఇటువంటి కార్యములు చేయుటకై ధైర్యపరచాలి.

**5-10వ. ఎజ్రా ప్రార్థించి, ప్రధాన యాజకులు, లేవీయులు, ఇశ్రాయేలీయులులందరి చేత ప్రమాణము చేయించుట :-** ఎజ్రా లేచి, ప్రధాన యాజకులును, లేవీయులును, ఇశ్రాయేలీయులందును ఆ మాట ప్రకారముగా చేయునట్లుగా వారిచేత ప్రమాణము చేయించెను. వారు ప్రమాణము చేసికొనగా ఎజ్రా దేవుని మందిరము ఎదుటనుండి లేచి, ఎల్యాషీబు కుమారుడైన యెహోవాను యొక్క గదిలో ప్రవేశించెను. అతడు అచ్చటికివచ్చి, చెరపట్టబడినవారి అపరాధమును బట్టి దు:ఖించుచు, భోజనమైనను పానమైనను చేయకుండెను. ఎల్యాషీబు ప్రధాన యాజకుడు, ప్రధాన యాజకుని ఇంటివారు కూడా పశ్చాత్తాపపడాలి. చెరనుండి విడుదల నొందినవారు యెరూషలేమునకు కూడి రావలెనని యూదా దేశమంతటి ప్రకటన చేయబడెను. యూదా వంశస్థులందరు బెన్యామీనీయులు అందరును మూడు దినములలోగా యెరూషలేమునకు కూడి వచ్చిరి. అది తొమ్మిదవ నెల; యిరువదియవ దినమున జనులందరును దేవుని మందిరపు వీధిలో కూర్చుని గొప్ప వర్షాలచేత తడియుచు, ఆ సంగతిని తలంచుట వలన వణుకుచుండిరి. అప్పుడు యాజకుడైన ఎజ్రా లేచి ఇశ్రాయేలీయులతో 'మీరు దేవుని ఆజ్ఞను మీరి అన్యస్త్రీలను పెండ్లిచేసికొని, ఎక్కువ అపరాధమును చేసితిరని చెప్పాడు. ప్రజలు మౌనముగా అంగీకరించిరి.

**11వ. ఎజ్రా తీర్పు తీర్చుట :-** యిప్పుడు మీ పితరుల యొక్క దేవుడైన యెహోవా యెదుట మొదటిదిగా మీ పాపము ఒప్పుకొని, రెండవదిగా ఆయన చిత్తానుసారముగా నడుచుకొనుటకు సిద్ధపడుడని చెప్పాడు. (అనగా పెండ్లి చేసికొనిన దేశపు జనులగు అన్యస్త్రీలను విసర్జించి ప్రత్యేకపరచుకొని యుండుట)

**12-14వ. ప్రజలు పాపము విషయమై పరితపించి కూడి వచ్చుటకు దిద్దుకొనుటకు ఒప్పుకొనుట :-** అందుకు సమాజకులందరు ఎలుగెత్తి ఎజ్రా ఇట్లనిరి. ఇప్పుడు వర్షము వచ్చుచున్నందున మేము బయట నిలువలేము, అన్య స్త్రీలను పెండ్లి చేసికొనిన మేము అనేకులైయున్నాము. ఈ విషయములో అనేకులము అపరాధులము కాబట్టి సమాజపు పెద్దలనందరిని యీ పనిమీద ఉంచవలెను. దేవుని కఠినమైన కోపము మా మీదికి రాకుండా తొలగిపోవునట్లుగా అన్యస్త్రీలను పెండ్లిచేసికొనిన మేము నీవు చెప్పినట్లుగానే వారిని విసర్జించి ప్రత్యేకపరచుకొని యుందుమని చెప్పిరి.

**15-17వ. అన్యస్త్రీలను పెండ్లి చేసికొనిన వారందరి సంగతి దిద్దబడి సమాప్తము చేయబడుట :-** అప్పుడు ఆశాహేలు కుమారుడైన యోనాతానును తిక్వా కుమారుడైన యహజ్యాయును ఆ పనికి నిర్ణయింపబడగా మెషుల్లామును లేవీయుడైన షబ్బెతైయును వారికి సహాయులై యుండిరి. పదియవ నెల మొదటి దినమున ఈ సంగతిని విమర్శించుటకు కూర్చుండి, మొదటి నెల మొదటి దినమున అనగా మూడు నెలలలో అన్యస్త్రీలను పెండ్లి చేసికొనిన వారందరి సంగతి వారు సమాప్తము చేసిరి. 2 దిన 7:14వ.లో నా పేరు పెట్టబడిన నా జనులు తమ్మునుతాము తగ్గించుకొని ప్రార్థన చేసి నన్ను వెదకి తమ చెడు మార్గములను విడిచినయెడల, ఆకాశమునుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును అన్న వాక్య ప్రకారము ప్రజలు తమ్మును తాము తగ్గించుకొని తమ పాపమును ఒప్పుకొనిరి. పెండ్లి చేసికొనిన దేశపు జనులగు అన్యస్త్రీలను విసర్జించి ప్రత్యేకపరచుకొనిరి.

**18-24వ. 25-44వ.** యాజకులలో, లేవీయులలో, గాయకులలో, ద్వారపాలకులలో అన్యస్త్రీలను పెండ్లిచేసికొనిన వారందరి సంగతి సమాప్తము చేయబడెను. పాత నిబంధన కాలములో మందిర కార్యములను జరిగించు యాజకులు, లేవీయులు, గాయకులు, ద్వారపాలకుల వలె నేటి దినములలో ఎఫె 4:13 ప్రకారము సంఘములలో సువార్తికులు, కాపరులు, ఉపదేశకులు కలరు. వీరు తమ వివాహములో కాని తమ పిల్లల వివాహములలో కాని దారి తప్పక యుండునట్లు చూచుకొనవలెను. ఇశ్రాయేలీయులలో అన్యస్త్రీలను పెండ్లి చేసికొనిన వారందరి సంగతి సమాప్తము చేయబడెను. ఎవరిలోనైనను నిజమైన ఉజ్జీవము మొదటిదిగా పాపము ఒప్పుకొని, రెండవదిగా ఆయన చిత్తానుసారముగా నడుచుకొనుట ద్వారా కలుగును.

# వాక్యానుసారమైన విశ్వాసుల వివాహాలు – కుటుంబ జీవితములు కట్టబడుట

విశ్వాసుల వివాహాలు దేవుని చిత్త ప్రకారము జరగాలి. ఇది దేవుని చిత్తమని విశ్వాసిలో ఉన్న దేవుని ఆత్మ తనలో ఉన్న మనుష్యాత్మతో చెప్పును. అప్పుడు తన హృదయములో సమాధానము కలుగును. దేవుని చిత్తము బైబిలు వాక్యప్రకారముగా ఉండును.

**దేవుని చిత్తము :-** ఆది 1:26 దేవుడు మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము; 27 దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాని, పురుషునిగాని వారిని సృజించెను. ఆది 2:18 దేవుడైన యెహోవా నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదునను కొనెను. ఆమెయే నిజమైన సరియైన సహకారి.

**దేవుని చిత్తము వలన జరిగిన ఇస్సాకు వివాహము :-** ఆది 24:3 నేను ఎవరి మధ్య కాపురమున్నానో ఆ కనానీయుల కుమార్తెలలో ఒకదానిని నా కుమారునికి పెండ్లి చేయక 4 నా స్వదేశమందున్న నా బంధువుల యొద్దకు (విశ్వాస గృహమునకు) వెళ్లి ఇస్సాకును నా కుమారునికి భార్యను తెచ్చునట్లు ఆకాశము యొక్క దేవుడును భూమి యొక్క దేవుడునైన యెహోవా తోడని నీ చేత ప్రమాణము చేయించెదననెను. ఆది 24:50 లాబానును బెతూయేలును ఇది యెహోవా వలన కలిగిన కార్యము, మేమైతే అవునని గాని కాదనిగాని చెప్పజాలము. ఇది దేవుని చిత్త ప్రకారమైన వివాహము.

హెబ్రీ 13:4 వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగాను, పానుపు నిష్కల్మషమైనదిగా ఉండవలెను; వేశ్యాసంగులకును, వ్యభిచారులకును దేవుడు తీర్పు తీర్చును. వివాహము అనగా వివాహము జీవితము అన్ని విషయములలో ఘనమైనదిగాను అనుట ఎవరిని వివాహమాడాలి అను తీర్మానమునుండి అన్ని విషయములలో దేవుని చిత్త ప్రకారముండుటయే ఘనమైనదని గమనించాలి. అలాగే పానుపు విషయములోను ఘనమైనదిగాను ఉండాలి, అనుటలో వివాహమునకు ముందు ప్రధానమునకు ముందుకాని తరువాత కాని సహజీవనము చేయుట పానుపులో పాల్గొనుట పాపమని గుర్తించాలి. ఆది 24:67 ఇస్సాకు తల్లియైన శారా గుడారములోనికి ఆమెను తీసికొనిపోయెను. అట్లు అతడు రిబ్కాను పరిగ్రహింపగా ఆమె అతనికి భార్య ఆయెను; అతడు ఆమెను ప్రేమించెను. ప్రేమ పానుపులు వివాహము తరువాతనే ఉండాలని గుర్తించండి.

2 కొరిం 6:14 మీరు అవిశ్వాసులతో జోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము ? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు ? 15 క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము ? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది ? 16 దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక ? మనము దేవుని ఆలయము. దేవుడిలాగు సెలవిచ్చుచున్నాడు. నేను వారిలో నివసించి సంచరింతును; నేను వారి దేవుడనై యుందును వారు నా ప్రజలైయుందురు. 17 కావున మీరు వారి మధ్యనుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైన దానిని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు. లేవీ 20:26లో మీరు నాకు పరిశుద్ధులైయుండవలెను. యెహోవా అను నేను పరిశుద్ధుడను. మీరు నావారై యుండునట్లు అన్యజనులలో నుండి మిమ్మును వేరుపరచితిని అన్నాడు. వివాహ విషయములోను ప్రత్యేకముగా ఉండాలి.

**దేవుని ఆత్మ మన ఆత్మతో చెప్పుట :-** యెషయా 30:21 మీరు కుడితట్టయినను ఎడమ తట్టయినను తిరిగినను ఇదే త్రోవ. దీనిలో నడుపుడి అని నీ వెనుకనుండి యొక శబ్దము నీ చెవులకు వినబడును. ఇది నీ మనస్సాక్షితో సాక్ష్యము.

**వాక్యముతో స్థిరపరచుట :-** దేవుడు తన చిత్తమును దేవుని యొద్ద కనిపెట్టుకొని ఉన్నవారికి వాక్యము ద్వారా కూడా బయలుపరచును.

**హృదయములో సమాధానము :-** యాకో 3:17. పై నుండి వచ్చు జ్ఞానము మొదట పవిత్రమైనది, సమాధానకరమైనది, మృదువైనది, సులభముగా లోబడునది, కనికరముతోను మంచి ఫలములతోను నిండుకొనినది. కనుక దేవుని చిత్తప్రకారము జతపరచబడినవారు జీవితకాలమంత మంచి ఫలములతో నిండుకొనియుందురు. దేవుని చిత్తములో పైన చెప్పినదంతయు నుండును. ఉదా :-

1) నిర్గ 2:1 లేవి వంశస్థుడొకడు వెళ్లి లేవి కుమార్తెను వివాహము చేసికొనెను. 2) యెషయా 8:3 నేను ప్రవక్త యొద్దకుపోతిని; ఆమె గర్భవతియై కుమారుని కనినది.

**ప్రత్యేకముగా లేనివారు :- (దేవుని చిత్త ప్రకారము జరుగని వివాహములు)**

1) ఆది 26:34. ఏశావు నలువది సంవత్సరములవాడైనప్పుడు హిత్తీయుడైన బేయేరీ కుమార్తెయగు యహూదీతును హిత్తీయుడైన ఏలోను కుమార్తెయగు బాశెమతును పెండ్లిచేసికొనెను. 2) ఆది 28:8 ఇదిగాక కనాను కుమార్తెలు తన తండ్రియైన ఇస్సాకునకు ఇష్టురాండ్రు కారని ఏశావునకు తెలిసినప్పుడు 9 ఏశావు ఇష్మాయేలు నొద్దకు వెళ్లి, తనకున్న భార్యలుగాక అబ్రహాము కుమారుడైన ఇష్మాయేలు కుమార్తెయు నెబాయోతు సహోదరియైన

మహలతును కూడ పెండ్లి చేసికొనెను. 35 వీరు ఇస్సాకునకును రిబ్కాకును మనోవేదన కలుగజేసిరి. 3) హోషే 7:8 ఎఫ్రాయిము అన్యజనులతో కలసిపోయెను (వివాహ విషయములో కూడా) ఎఫ్రాయిము ఎవరును త్రిప్పివేయని అప్పమువంటివాడాయెను.

**వివాహము ద్వారా జతపరచబడినవారు మనుష్యుల చేత వేరుపరచబడకూడదు :-** మత్త 19:5 (వివాహములో) పురుషుడు తల్లిదండ్రులను విడిచి తన భార్యను హత్తుకొనును, వారిద్దరును ఏకశరీరముగా ఉందురు. 6 కాబట్టి వారికను ఇద్దరుకాక ఏకశరీరముగా ఉన్నారు గనుక దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచకూడదని యేసుప్రభువు చెప్పెను. 1 కొరిం 7:39 భార్య తన భర్త బ్రదికియున్నంత కాలము బద్ధురాలైయుండును, భర్త మృతిపొందిన యెడల ఆమె కిష్టమైనవానిని పెండ్లి చేసికొనుటకు స్వతంత్రురాలై యుండునుగాని ప్రభువునందు మాత్రమే పెండ్లిచేసికొనవలెను. 1 కొరిం 7:12 ప్రభువు కాదు నేనే తక్కినవారితో చెప్పునదేమనగా ఏ సహోదరునికైన అవిశ్వాసురాలైన భార్యయుండి, ఆమె అతనితో కాపురము చేయనిష్టపడిన యెడల, అతడు ఆమెను పరిత్యజింపకూడదు. 13 మరియు ఏ స్త్రీకైనను అవిశ్వాసియైన భర్తయుండి, ఆమెతో కాపురముచేయ నిష్టపడిన యెడల, ఆమె అతని పరిత్యజింపకూడదు. ఇప్పుడైతే 15 అవిశ్వాసియైనవాడు ఎడబాసిన ఎడబాయవచ్చును; అట్టి సందర్భములలో సహోదరునికైనను, సహోదరునికైనను నిర్బంధము లేదు. సమాధానముగా ఉండుటకు దేవుడు మనలను పిలిచెను. 16 ఓ స్త్రీ, నీ భర్తను రక్షించెదవో లేదో నీకేమి తెలియును? ఓ పురుషుడా, నీ భార్యను రక్షించెదవో లేదో నీకేమి తెలియును ? 1 పేతు 3:1 అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి; 2 అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తన చూచి, వాక్యములేకుండానే తమ భార్యల నడవడివలన రాబట్టబడ వచ్చును.

**ఎఫె 5:22 భార్యలు భర్తలకు లోబడియుందురు :-** స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంత పురుషులకు లోబడియుండుడి. 23 క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు. ఎఫె 5:31 ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని, తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారిద్దరును ఏకశరీరమగుదురు. 32 ఈ మర్మము గొప్పది; అయితే నేను క్రీస్తును గూర్చియు సంఘమును గూర్చి చెప్పుచున్నాను. క్రీస్తు సంఘమును ఎప్పుడైనను విడిచిపెట్టునా ? అలాగే భర్తలు భార్యలను, భార్యలు భర్తలను ఎట్టి పరిస్థితిలోను విడిచిపెట్టకూడదు. 1 కొరిం 11:3 ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తనియు, స్త్రీకి శిరస్సు పురుషుడనియు, క్రీస్తునకు


శిరస్సు దేవుడనియు మీరు తెలిసికొనవలెనని కోరుచున్నాను. 1 కొరిం 11:8 ఏలయనగా స్త్రీ పురుషుని నుండి కలిగెనేగాని పురుషుడు స్త్రీ నుండి కలుగలేదు. 9 మరియు స్త్రీ పురుషుని కొరకే గాని పురుషుడు స్త్రీకొరకు సృష్టింపబడలేదు. 10 ఇందువలన దేవదూతలను బట్టి అధికార సూచన స్త్రీకి తలమీద ఉండవలెను. 11 అయితే ప్రభువునందు స్త్రీకి వేరుగా పురుషుడు లేడు, పురుషునికి వేరుగా స్త్రీ లేదు. స్త్రీ పురుషుని నుండి ఏలాగు కలిగెనో అలాగే పురుషుడు స్త్రీ మూలముగా కలిగెను, గాని సమస్తమైనవి దేవుని మూలముగా కలిగియున్నవి.

**- వరప్రసాదరెడ్డి**

## మాచే రచించబడిన పుస్తకములు

**కొత్త నిబంధన గ్రంథములు**

| | | |
|---|---|---|
| 1. | పౌలు పత్రికల పరిచయము | రూ. 120-00 |
| 2. | సార్వత్రిక పత్రికల పరిచయము | రూ. 50-00 |
| 3. | ప్రకటన గ్రంథ పరిచయము | రూ. 50-00 |
| 4. | యెహోషువ గ్రంథ ధ్యానము | రూ. 50-00 |
| 5. | ఎజ్రా గ్రంథ ధ్యానము | రూ. 40-00 |
| 6. | కీర్తనల గ్రంథ పరిచయము (మొదటి భాగము) | రూ. 80-00 |
| 7. | యెషయా గ్రంథ పరిచయము | రూ. 80-00 |
| 8. | యిర్మీయా గ్రంథ పరిచయము | రూ. 50-00 |
| 9. | యెహెజ్కేలు గ్రంథ పరిచయము | రూ. 50-00 |
| 10. | దానియేలు గ్రంథ పరిచయము | రూ. 50-00 |
| 11. | ప్రవక్తల చిన్న గ్రంథముల పరిచయము | రూ. 50-00 |
| 12. | ఇశ్రాయేలు దేశము | రూ. 20-00 |
| 13. | పరిశుద్ధ గ్రంథమునందలి నామములు-అర్థములు | రూ. 120-00 |
| 14. | రూతు గ్రంథ ధ్యానము (కెజియా కుమారి) | రూ. 50-00 |
| 15. | ఎస్తేరు గ్రంథ ధ్యానము (కెజియా కుమారి) | రూ. 50-00 |
| 16. | ప్రభువు - పరిశుద్ధ స్త్రీలు (కెజియా కుమారి) | రూ. 60-00 |
| 17. | ప్రభువు-పరిశుద్ధ స్త్రీలు-రెండవ భాగము (కెజియా కుమారి) | రూ. 60-00 |


క్రీ.పూ. 538-445 మధ్యకాలం
సీయోనుకు తిరిగి రాక
బియా
కర్కెమీషు
హారాను
ఎక్బతానా
అలెప్పో
అష్షూరు
హమాతు
రెసెపు
ప్రవాసుల తిరిగి రాక (క్రీ.పూ. 537-515)
యూఫ్రటీసు నది
టైగ్రిస్ నది
గెబాలు
తద్మోరు
ఎజ్రా (క్రీ.పూ. 457-428)
దమస్కు
సిప్పారు
తూరు
నిప్పూరు
పారశీక సామ్రాజ్యం
బబులోను
సమరయ
రబ్బా / రబ్బాతు
ఊరు
షూషను
యెరూషలేము
0
100 కిలోమీటర్లు
నెహెమ్యా